# స్విమ్స్ యూనివర్సిటిలో జాతీయ వైద్యుల దినోత్సవం




**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం శ్రీ పద్మావతి ఓ.పి.డి బ్లాక్ ఆడిటోరియంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిధిగా హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజ్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్.మురళీధర్ హాజరయారు.స్విమ్స్ సంచాలకులు/ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్, స్విమ్స్ డీన్ డా॥ అలోక్ సచన్, మెడికల్ సూపరిండెంట్ డా॥ రామ్, నెఫ్రాలజీ సీనియర్ ప్రొ॥ డా॥ శివకుమార్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా॥ ఉమామహేశ్వరరావు, సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ మరియు మెడిసిన్ విభాగాధిపతి డా॥ అల్లాడి మోహన్,ముఖ్య అతిధి మురళీధర్ లతో కలసి జ్యోతిని వెలిగించి డా॥ బిధాన్ చంద్ర రాయ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళలు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్వి కుమార్ ప్రసంగిస్తూ. భారతదేశం లోని ప్రముఖ వైద్యులు మరియు ఇతర వైద్య నిపుణుల అద్భుతమైన కృషిని గుర్తించడం కోసం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని 'ప్రతి సంవత్సరం జూలై 1న జరుపుకుంటామన్నారు.'రోగులను నయం చేసే వైద్యుల మనసును నయం చేసేది ఎవరు అనే థీమ్ తో ఈ ఏడాది కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు చెప్పారు. వైద్య వృత్తి మహోన్నతమైనదని, వైద్యులకు వైద్య విజ్ఞానంతో బాటు నైతిక విలువలు,సేవా భావం ముఖ్యమన్నారు. డబ్బు ప్రధానంగా చేసే వైద్యం సేవ కాదన్నారు.డా॥ అల్లాడి మోహన్ మాట్లాడుతూ...వైద్య వృత్తిని సామాజిక బాధ్యతగా భావించి విలువలతో కూడిన సేవలను రోగులకు అందించాలని కోరారు. ఈ క్రమంలో తమ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు.స్విమ్స్ డీన్ డా॥ అలోక్ సచన్ గారు మాట్లాడుతూ... ప్రాణాలకు తెగించి సేవలు అందించే వైద్యులకు కృతజ్ఞతలు తెలపడం, వారి సేవలను గుర్తించి సన్మానించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని, వైద్య, వృత్తి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తూ సమాజ ఆరోగ్యాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి వైద్యుడికి జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షాలు తెలియజేస్తున్నానన్నారు. నెఫ్రాలజి సీనియర్ ప్రొ॥ డా॥ శివకుమార్ మాట్లాడుతూ... పశ్చిమ బెంగాల్ రెండో సి.యం. బిధాన్ చంద్ర రాయ్ ఒక ప్రముఖ వైద్యుడని, సి.యం.గా వైద్య రంగంలో ఆయన చేసిన సేవలకు గౌరవ సూచకంగా బిధాన్ పుట్టిన రోజైన జూలై 1ని భారత ప్రభుత్వం జాతీయ వైద్యుల దినోత్సవంగా 1991లో ప్రకటించింది. అప్పటి నుండి మన దేశంలో ప్రతి ఏడాది జూలై 1న నేషనల్ డాక్టర్స్ డే గా జరుపుకుంటామని తెలిపారు.మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మాట్లాడుతూ రోగ నిర్ధారణ, చికిత్స, శస్త్రచికిత్స, కోలుకోవడం మరియు జీవితంలోని అత్యంత క్లిష్టమైన క్షణాలలో రోగులకు మార్గనిర్దేశం చేసే వైద్యులను గుర్తించే రోజు అని తెలియజేసారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్ గారు మాట్లాడుతూ... వైద్యులు ప్రాణదాతలు. అర్ధరాత్రి, అపరాత్రి అని తేడా లేకుండా వైద్య సేవలు అందజేస్తుంటారు. విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే వైద్యులు భగవంతుడితో సమానమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్ ను స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్.ఆర్.వి.కుమార్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారుఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగాధిపతి డా. వనజాక్షమ్మ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అంజు డి అదే,వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు, డాక్టర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఎర్రమ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ (పి.ఆర్) వి.రాజశేఖర్, మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్, సిబ్బంది, స్విమ్స్ మరియు యస్.పి.యం.సి.డబ్ల్యు, యం.బి.బి.యస్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గెంజి లక్ష్మమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా
## రూ. 2,07,727 ఎల్ఓసి మంజూరు చేయించిన ఎమ్మెల్యే నాని

**చంద్రగిరి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి మండలం కొత్త శానంభట్ల గ్రామ పంచాయతీకి చెందిన గెంజి లక్ష్మమ్మ అనారోగ్యంతో తిరుపతిలోని నారాయణాద్రి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అత్యవసరంగా సర్జరీ (ఆపరేషన్) చేయాల్సి ఉంటుందని, అందుకు 2 లక్షలకు పైగా ఖర్చవుతుందని కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానిక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తులసేశ్వర రెడ్డిని సంప్రదించారు. ఆయన ఈ విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల పరిస్థితిని విని చలించిపోయిన ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. నారాయణాద్రి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న గెంజి లక్ష్మమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2,07,727 ఎల్ఓసి మంజూరు చేయించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఎల్ఓసి అందడంతో వైద్యులు ఆమెకు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం లక్ష్మమ్మ కోలుకుంటున్నారు.కష్టకాలంలో తాము అడిగిన వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలిచిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కి, తమకు అండగా నిలిచిన టిడిపి నాయకుడు తులసేశ్వర రెడ్డికి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

## పారదర్శకత, లక్ష్యసాధనతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరగలరు

**- అమాక్స్ సంస్థ అధినేత డాక్టర్ జి. దశరథ రెడ్డి**

**పీలేరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే పారదర్శకత, లక్ష్యసాధన, పొదుపు అలవాటు తప్పనిసరిగా ఉండాలని అమాక్స్ సంస్థ అధినేత డాక్టర్ జి. దశరథ రెడ్డి అన్నారు. బుధవారం పీలేరు మండలం, గూడరేవుపల్లి పంచాయితీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య అనేది కేవలం మార్కులకే పరిమితం కాకుండా నైతిక విలువలు, సేవా దృక్పథం, సామాజిక బాధ్యతలను పెంపొందించే సాధనంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. పీలేరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చరిత్ర, ఇతిహాసాలను విస్తృతంగా చదివి, వాటిలోని నీతిని గ్రహించి జీవితంలో ఆచరించాలని సూచించారు. చేసేది మంచి పనైతే దానికి సహకారం అందించే మార్గాలు సహజంగానే ఏర్పడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక స్థాయికి ఎదిగిన తర్వాత తమ కుటుంబంతో పాటు గ్రామం, సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడాలని పిలుపునిచ్చారు.

ఇతరుల ప్రశంసల కోసం కాకుండా సేవాభావంతో పనిచేసే వారే సమాజంలో చిరస్థాయిగా నిలుస్తారని చెప్పారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు మంచి మార్కులతో గ్రేడింగ్ సాధించిన వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని, ముఖ్యంగా 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తామని డాక్టర్ దశరథ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ద్వారకనాథ రెడ్డి, జీవీఎస్ సంస్థ అధినేత రాంబాబు, ప్రధానోపాధ్యాయిని నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారుల స్పందనతో నిరాహార దీక్ష వాయిదా!

**పుంగనూరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగమ్మ చెరువు కట్ట నుండి బెంగళూరు వెళ్లే రోడ్డు పనులు పూర్తి చేయకపోతే నాలుగు రోజుల లోపల నిరాహార దీక్షకు పూనుకుంటామని సామాజికవేత్త అయూబ్ ఖాన్ బిజెపి పార్టీ నరసింహులు గత రెండు రోజులు మునుపు విలేకరుల సమావేశంలో తెలిపి ఉన్నారు. ఈ రోడ్డు విషయమై ఆర్ అండ్ బి అధికారులు స్పందించారని బుధవారం సామాజికవేత్త ఆయుఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం లోపు రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.మాట ప్రకారం నిర్ణీత గడువులోగా పనులు ప్రారంభమవుతాయనే నమ్మకంతో ప్రస్తుతానికి మా తదుపరి నిరసన నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని,ఒకవేళ ఇచ్చిన గడువులోగా పనులు ప్రారంభం కాకపోయినట్లయితే, ప్రజల పక్షాన నిలబడి మా నిరసనను మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

# జలధారతో జలకళ సంతరించుకున్న గుమ్మ సముద్రం చెరువు

**- పూడికలో మునిగిన చెరువుకు పునర్జన్మ...మూడింతలు పెరిగిన నీటి నిల్వ సామర్థ్యం**
**- నీటి సంరక్షణలో అన్నమయ్య జిల్లా సరికొత్త అధ్యాయం**
**- రైతుల జీవితాల్లో వెలుగులు!... జిల్లాలో నీటి సంరక్షణకు ఆదర్శంగా నిలిచిన జలధార**



**మదనపల్లె,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నీరు ఉంటేనే జీవనం... నీరు ఉంటేనే వ్యవసాయం... అనే సంకల్పంతో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్చే పట్టిన లిజలధార కార్యక్రమంలి అన్నమయ్య జిల్లాలో అద్భుత విజయాన్ని సాధించింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ దూరదృష్టి, సమర్థవంతమైన ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో జిల్లాలోని వందలాది సంప్రదాయ నీటి వనరులు పునరుజ్జీవం పొందాయి. దశాబ్దాలుగా పూడికతో నిండిపోయి, నీటి ప్రవాహం నిలిచిపోయిన పాత సరఫరా కాలువలను పునరుద్ధరించి, చెరువులకు మళ్లీ జీవం పోయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి విప్లవానికి నాంది పలికింది. జిల్లాలో అమలు చేసిన జలధార కార్యక్రమం విజయవంతమై విశేష ఫలితాలు సాధించడంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అన్నమయ్య జిల్లా సాధించిన విజయానికి గొప్ప గుర్తింపుగా నిలిచింది. గుమ్మ సముద్రం చెరువు – జలధార విజయానికి ప్రతీక అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని గుమ్మ సముద్రం చెరువు నేడు జలధార కార్యక్రమం సాధించిన అద్భుత ఫలితాలకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.గతంలో వర్షాలు బాగా కురిసినా చెరువుకు నీరు చేరకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సరఫరా కాలువలు మూసుకుపోవడం, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడడం వల్ల వర్షపు నీరు వృథాగా వెళ్లిపోయేది. దీంతో చెరువు నిండకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, బోర్వెల్లు ఎండిపోవడం, సాగు విస్తీర్ణం క్షీణించడం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర ప్రణాళిక రూపొందించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) ద్వారా చెరువుకు నీటిని అందించే సుమారు 2 కిలోమీటర్ల సరఫరా కాలువలను పూర్తిగా పునరుద్ధరించారు. అదేవిధంగా రూ.30 లక్షల వ్యయంతో నీటి ప్రవాహాన్ని సులభతరం చేసే "అలుగులు" నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల వల్ల వర్షపు నీరు ఎటువంటి అడ్డంకులు లేకుండా నేరుగా చెరువులోకి చేరే పరిస్థితి ఏర్పడింది. 8.10 నుంచి 30.05 (ఎం సి ఎఫ్ టి) ... నీటి నిల్వలో అద్భుత పెరుగుదల జలధార కార్యక్రమానికి ముందు గుమ్మ సముద్రం చెరువు కేవలం 8.10 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండేది. కాలువల పునరుద్ధరణ, అలుగుల నిర్మాణం పూర్తైన అనంతరం కురిసిన మంచి వర్షాలతో చెరువు 30.05 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని నిల్వ చేసుకునే స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం చెరువు 91.07 శాతం సామర్థ్యంతో నిండి గ్రామానికి, రైతులకు, పశుసంపదకు, భూగర్భ జలాలకు ప్రధాన ఆధారంగా మారింది.గతంలో వృథాగా ప్రవహించే వర్షపు నీరు నేడు ప్రతి చుక్కా చెరువులో నిల్వవుతోంది. ప్రకృతి ప్రసాదించిన నీటి వనరులను సంరక్షించి భావితరాలకు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ చెరువు ద్వారా సాకారమైంది.

**భూగర్భ జలాల పెరుగుదల -- రైతులకు కొత్త ఆశలు**

జలధార కార్యక్రమం ప్రభావంతో అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలమట్టం 8.59 మీటర్ల వరకు పెరగడం ఈ కార్యక్రమం విజయానికి అద్దం పడుతోంది. గుమ్మ సముద్రం చెరువు పరిసర ప్రాంతాల్లో గతంలో నీరు అందని బోర్వెల్లు నేడు సమృద్ధిగా రీచార్జ్ అవుతున్నాయి. వేసవి కాలంలో కూడా బోర్వెల్లలో నీరు అందుబాటులో ఉండటంతో రైతులు ధైర్యంగా పంటలు సాగు చేస్తున్నారు.భూగర్భ జలాల పెరుగుదల వల్ల తాగునీటి సమస్య కూడా గణనీయంగా తగ్గి గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగింది. నీటి కొరత కారణంగా ఇబ్బందులు పడిన కుటుంబాలు ఇప్పుడు సంవత్సరమంతా నీటి లభ్యతను అనుభవిస్తున్నాయి.

**180 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు**

గుమ్మ సముద్రం చెరువు ద్వారా ప్రస్తుతం ప్రత్యక్షంగా సాగునీరు అందుతోంది. అదనంగా భూగర్భ జలాలు పెరగడంతో మరో 90 ఎకరాల్లో బోర్వెల్ల ద్వారా సాగులిలి కొనసాగుతోంది. మొత్తంగా 270 ఎకరాల వ్యవసాయ భూమి ఈ జలధార కార్యక్రమం వల్ల ప్రత్యక్షంగా లబ్ధి పొందుతోంది. సాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండటంతో రైతులు ఒకే పంటకు పరిమితం కాకుండా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. పంటల దిగుబడి పెరగడంతో పాటు రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. పశుసంపదకు తాగునీరు లభించడం, పర్యావరణ సమతుల్యత మెరుగుపడటం, పచ్చదనం విస్తరించడం వంటి అనేక సానుకూల మార్పులు చోటు చేసుకున్నాయి.

**ప్రజల భాగస్వామ్యం**

జలధార కార్యక్రమం ప్రభుత్వ యంత్రాంగం, గ్రామస్థులు, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు కలిసి పనిచేసిన సమిష్టి కృషికి ప్రతీకగా నిలిచింది. ప్రతి కాలువను గుర్తించి పునరుద్ధరించడం, ప్రతి చెరువును పునర్జీవింపజేయడం, ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టడం అనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో నీటి నిర్వహణకు కొత్త ప్రమాణాలను నెలకొల్పింది.

**రాష్ట్రానికి ఆదర్శంగా అన్నమయ్య జిల్లా**

అన్నమయ్య జిల్లాలో సాధించిన ఈ అద్భుత ఫలితాలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం జలధార కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ప్రారంభమైన ఈ నీటి ఉద్యమం నేడు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది రైతులకు ఆశాకిరణంగా మారుతోంది.గుమ్మ సముద్రం చెరువు విజయగాథ కేవలం ఒక చెరువు పునరుద్ధరణ మాత్రమే కాదు. ఇది సమర్థవంతమైన పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, ప్రకృతి వనరుల సంరక్షణ, ప్రభుత్వ సంకల్పం, రైతు సంక్షేమం కలిసి సాధించిన అసాధారణ విజయగాథ. నేడు నీటితో కళకళలాడుతున్న గుమ్మ సముద్రం చెరువు, పచ్చని పంట పొలాలు, రీచార్జ్ అయిన బోర్వెల్లు, ఆనందంగా వ్యవసాయం చేస్తున్న రైతులు– ఇవన్నీ జలధార కార్యక్రమం సాధించిన విజయాన్ని కళ్ళముందే సాక్షాత్కరిస్తున్నాయి.

# తిరుపతి జిల్లా

## తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ

**వాల్మీకిపురం ,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ (బీసీ) కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు వల్లిగట్ల వెంకటరమణ బుధవారం తిరుపతి ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మదనపల్లి, సత్య సాయి, అనంతపురం డిపో పరిధిలోని పలు గ్రామాలకు సరిపడా బస్సు సౌకర్యం లేక ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో వివరించారు. ముఖ్యంగా జాతీయ రహదారి ఎన్‌హెచ్–79 మీదుగా ప్రయాణించే బస్సులు అవసరమైన ప్రాంతాల్లో ఆగేలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులు ఏర్పాటు చేసి ప్రజల రవాణా సమస్యలను పరిష్కరించాలని కోరారు.అదేవిధంగా, మదనపల్లి డిపో పరిధిలో నాన్‌స్టాప్ సర్వీసుల కారణంగా స్థానిక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో స్టాపులు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జగదీష్ వెంటనే స్పందించి, మదనపల్లి డిపో అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే సత్యసాయి, అనంతపురం డిపోల మేనేజర్లకు కూడా సంబంధిత అంశాలపై మెసేజ్ పంపించినట్లు వల్లిగట్ల వెంకటరమణ తెలిపారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని రీజినల్ మేనేజర్ హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

## విద్యా నాణ్యతలో మరో మైలురాయి

**- మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ**

**- 2026--27 విద్యా సంవత్సరానికి బి.టెక్ , ఇతర కోర్సులకు ప్రవేశాలు ప్రారంభం**

**మదనపల్లె/ కురబలకోట, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 2026--27 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి. ప్రదీప్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు అనుసంధానమైన బోధన, ఉత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలతో మిట్స్ దేశంలో గుర్తింపు పొందిన ప్రముఖ విద్యాసంస్థగా కొనసాగుతోందని పేర్కొన్నారు. యూనివర్సిటీలో బీటెక్, ఎం.టెక్, బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ మరియు పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి అని ఆయన అన్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు 100% వరకు స్కాలర్‌షిప్‌లు, అర్హతకు అనుగుణంగా ఫీజు రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో 5,895 ప్లేస్‌మెంట్ ఆఫర్లు లభించగా, 3,854 మంది విద్యార్థులు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని, ఇటీవల సి.ఎస్.ఈ విద్యార్థిని టి.ఆర్. దీక్ష అమెజాన్‌లో రూ.29.53 లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగం సాధించడం విశేషమని పేర్కొన్నారు. ఈ అకాడమిక్ ఇయర్ కు బీటెక్ నందు సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్,మెకానికల్ ఇంజినీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(ఏఐ మరియు రోబోటిక్స్) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐ మరియు డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(ఏఐ మరియు మెషిన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) లకు ప్రవేశాలు ప్రారంభం అయ్యాయని ఆయన అన్నారు. ఇతర కోర్సులు బీబీఏ మరియు బీసీఏ లు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు , ఇంటర్న్‌షిప్‌లు, విదేశీ విద్య అవకాశాలు, ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధనకు అనుకూల వాతావరణం మిట్స్ ప్రత్యేకతలని తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ దేశంలో అత్యుత్తమ ఉన్నత విద్యా సంస్థలలో ఒకటిగా తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటూ విద్యా రంగంలో విశిష్ట సేవలను అందిస్తోంది అని, 1998లో స్థాపించబడిన ఈ విశ్వవిద్యాలయం, గత 28 సంవత్సరాలుగా నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు మరియు పరిశ్రమల అనుసంధానంతో విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో తీర్చిదిద్దుతోంది అని అన్నారు.2026--27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అడ్మిషన్ పోస్టర్ ను యూనివర్సిటీ ప్రాంగణం లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రామనాథన్, ప్లేసెమెంట్ ఆఫీసర్ ద్రుపద్ వర్మ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సారు సత్యవేడును వెంటాడుతున్న సమస్యలను పరిష్కరించాలి

**సత్యవేడు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెనుకబడిన సత్యవేడును పలు సమస్యలు వెంటాడుతున్నాయి..ప్రభుత్వాలు మారినా ,పాలకులు మారినా,దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.ఒకపక్క సత్యవేడు శ్రీసిటీలో గత పుష్కరకాలంగా దాదాపు రెండు వందల యాభై కంపెనీలు నడుస్తూ పారిశ్రామికరణలో దూసుకుపోతుంది.ఈ నేపథ్యంలో పదివేల మంది కార్మికులు పలు కంపెనీలలో ఉపాధి పొంది పనిచేస్తున్నారు.ఈ క్రమంలో కొన్ని కంపెనీలలో పని చేస్తున్న కార్మికులు కంపెనీ యాజమాన్యం ఏర్పాటుచేసిన బస్సుల్లో రాకపోకలు సాగిస్తుండగా, మరికొన్ని కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు సొంత వాహనాల ద్వారా విధులకు వెళ్లి వస్తున్నారు.అయితే వరదయ్యపాలెం మండలం కదూరు క్రాస్ నుంచి సత్యవేడు మండలం మండలం దాసుకుప్పం వరకు ప్రస్తుతం డబుల్ లైన్ రోడ్లు ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఈ ప్రాంతంలో పారిశ్రామికీకరణ, నేపథ్యంలో వాహనాలు విపరీతంగా పెరగడంతో ఈ పరిస్థితి నెలకొంటుంది.ప్రధానంగా కదూరు క్రాస్ నుంచి దాసుకుప్పం వరకు నాలుగు లైన్ల రోడ్డును విస్తరించాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.అయినా ఈ విస్తరణ ప్రతిపాదన కాగితాలకే పరిమితమవుతూ కార్యరూపం దాల్చడం లేదు. అవసరమైతే ఇక్కడ నాలుగు లైన్ల రోడ్డును విస్తరించడంతోపాటు, తమిళనాడు,ఊతుకోటకు,సమీపంలో చిత్తూరు టు తర్చూరు హైవే రోడ్డుకు అనుసంధానం చేసినట్లయితే ఇక్కడ రోడ్డు ప్రమాదాలు ఘననీయంగా తగ్గే అవకాశాలు లేకపోలేదు.వాహన రాకపోకలు విపరీతంగా పెరిగిపోవడంతో, సత్యవేడు పట్టణంలో తరచూ వాహనాలు స్తంభించిపోయి పోలీసులకు సైతం తలనొప్పిగా మారింది.పైగా గంగ జాతర వంటి ఉత్సవాల సమయంలో పోలీసులు వాహన రాకపోవులకు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న ట్రాఫిక్ అంతరాయాలు తప్పడం లేదు. పట్టణ పరిధిలో ఇరుకైన రోడ్లు వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది. బైపాస్ రోడ్డు నిర్మాణం గురించిన ప్రతిపాదన తెరపైకి వచ్చినా,కార్యరూపం దాల్చిన పాపాల పోలేదు.అలాగే దాసుకుప్పంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి గతంలో నిధులు మంజూరైనా భూసేకరణ విషయంలో ముందు గొయ్యి వెనుక నుయ్యి అనే చందాగా మారింది.దీంతోపాటు శ్రీసిటీ కంపెనీలో, వేలాదిమంది పనిచేస్తున్న కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ ఆసుపత్రి నెలకొల్పాలన్న ప్రతిపాదన కూడా ప్రతిపాదనకే పరిమితమయ్యింది.ఈఎస్ఐ ఆసుపత్రి శ్రీసిటీలో నెలకొల్పితే వివిధ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు ఎంతో సదుపాయంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.ఇదే గాక కార్మికుల నైపుణ్యాన్ని పెంచడానికి నైపుణ్య శిక్షణ కేంద్రాలను నెలకొల్పుతామని గత సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినా నెరవేరలేదు.అలాగే కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు అందుతున్న వేతనాల్లో సగం సొమ్మును అద్దె భవనాలకు చెల్లించే పరిస్థితి వస్తుంది.ఈ ప్రాంతంలో ప్రస్తుతం ప్రైవేటు భవన యాజమాన్యాలు అద్దెలను విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారు.దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి కార్మికుల కోసం నివాస సముదాయాలు నిర్మించి తక్కువ అద్దెకు నివాస వసతి కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్యవేడు మండలం, మాధనపాలెం గ్రామానికి సమీపంలోని హీరో కంపెనీ విడి పరికరాల తయారీ ప్లాంటుకు భూమి పూజ చేయనున్న నేపథ్యంలో ఇక్కడ సమస్యలు కూడా పరిష్కరించగలరని స్థానికులు కోరుతున్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**- విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చిన అధ్యక్షులు డాక్టర్ ఈ. యుగంధర్**

**పలమనేరు,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా సమాజ ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన ధ్యేయమనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ( ఐఎంఏ ) పలమనేరు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ఐఎంఏ పలమనేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఈ. యుగంధర్ నాయకత్వం వహించగా, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, వారికి అవసరమైన వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించడం విశేషం. డాక్టర్స్ డే అంటే కేవలం వైద్య వృత్తిని గుర్తు చేసుకునే రోజు మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా విద్యార్థులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తూ సేవా కార్యక్రమాల ద్వారా వైద్యుల సామాజిక బాధ్యతను చాటిచెప్పే రోజు అని ఈ సందర్భంగా డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు.

వైద్య సేవ అనేది కేవలం ఆసుపత్రులకే పరిమితం కాకుండా ప్రజలు ఉన్నచోటుకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వారికి సరైన వైద్య సేవలు అందించడం నిజమైన వైద్య ధర్మమని ఆయన అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ వసతి గృహాల్లో నివసించే విద్యార్థులు భవిష్యత్ భారత నిర్మాణానికి పునాదులని, వారి ఆరోగ్యం బాగుంటేనే వారు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని పేర్కొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేకంగా ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపిక చేసి అక్కడ విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించామని తెలిపారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన డాక్టర్ యుగంధర్ ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని సవివరంగా వివరించారు. హాస్టల్‌లో నివసించే పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే వినియోగించడం, సమయానికి భోజనం చేయడం, పోషకాహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, రోజూ వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు.

# దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

## - చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచన



**చిత్తూరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి ఒక్కరూ తమ దంతాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఉదయం స్థానిక సుందరయ్య వీధిలోని డాక్టర్ అరుల్స్ టూత్ కేర్ క్లినిక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపిజి సెంటర్, ఇంప్లాంట్స్ అండ్ అలినర్స్ స్టూడియోను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శరీరంలోని అన్ని అవయవాలను సంరక్షించుకుంటేనే బ్రతికినంత కాలం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ముఖ్యంగా దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వాటి సంరక్షణను విస్మరిస్తే నోటి క్యాన్సర్ తో పాటు, అనేక క్రిములు శరీరంలోకి ప్రవేశించి ప్రాణాపాయంగా మారే అవకాశం ఉందన్నారు. ఇలాంటి జబ్బులను నివారించాలంటే ప్రతి ఒక్కరూ ఏడాదిలో కనీసం 2 నుంచి 3 సార్లు తమ దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ అరుల్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన దంతవ్యాధి బాధితులకు, ప్రజలకు దంత సంరక్షణపై ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అదే క్రమంలో తమ క్లినిక్ కు వచ్చిన బాధితులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లినిక్15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని చిత్తూరు నగరంలోనే తొలి సారిగా తమ క్లినిక్ లో ఏర్పాటు చేసిన ఆర్థో పాన్టోగ్రామ్ ( ఓపిజీ ) ద్వారా ఫుల్ మౌత్ చెకప్ చేస్తామన్నారు. ముఖ్యంగా ఈనెల 31వ తేదీలోగా వచ్చిన బాధితులకు రూ 5 వేలు విలువచేసే డిజిటల్ స్క్రీనింగ్, రూ 1000 విలువచేసే ఓపిజి ఎక్స్ రే తో పాటు డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. అదే విధంగా తమ క్లినిక్ లో జ్ఞానదంతాలను పీకివేయడం, రూట్ కెనాల్, టీత్ వైటెనింగ్, ఇంప్లాంట్స్ అమర్చడం తదితర చికిత్సలను ఇతర దంత వైద్యశాలల కన్నా తక్కువ ఫీజుతో చేస్తామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని చిత్తూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో దంత సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఆయా ప్రభుత్వాల అనుమతి పొందిన ఇతర సంస్థల ఉద్యోగులకు ఎన్టీఆర్ ఆరోగ్య భద్రత పథకం కింద నగదురహిత వైద్యాన్ని అందిస్తామని డాక్టర్ అరుల్ వెల్లడించారు. కాగా ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ అరుల్స్ టూత్ కేర్ క్లినిక్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఏ.పీ సి ఇ టి, పరీక్షా ఫలితాలలో మదర్ తెరిసా విద్యార్థులు



**పలమనేరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 2026 మే నెలలో జరిగిన ఇ ఏ పి, సి ఇ టి ఫలితాలలో మదర్ తెరిసా జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి మరోసారి కళాశాల కీర్తి ప్రతిష్టలు తెలియజేశారు. 3,138 ర్యాంకుతో ఆర్ కె సాయి షణ్ముక,5813 ర్యాంకుతో డి. హర్షవర్ధన్,7953 ర్యాంకుతో ఎం పావని శ్రీ,8571 ర్యాంకుతో టి. శ్వేత లు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. 10వేలు ర్యాంకు లోపు నలుగురు,20 వేల ర్యాంకు లోపు 22 మంది50వేలు ర్యాంకులోపు62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కళాశాల నుండి మొత్తం342 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 304 మంది విద్యార్థులు అర్హత సాధించారని కళాశాల కరస్పాండెంట్ ఎం. డాక్టర్ రవీంద్రబాబు తెలిపారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థులను వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందాన్ని కళాశాల చైర్మన్ ఎం. ఆర్ సునీల్, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి వారిని అభినందించారు.

# కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్త పెన్షన్ల పంపిణీ

**పుంగనూరు,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కొత్తగా మంజూరు చేసిన సామాజిక భద్రత పెన్షన్లను ఈరోజు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. పుంగనూరు మండలం, బోడేవారిపల్లి పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన నలుగురు పెన్షన్ దారులు అందుకుని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం తన కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తోందని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పుంగనూరు మండల కూటమి నాయకులు మాధవ రెడ్డి, చైతన్య రాయల్, గంగాధర్, బాలాజీ, సుబ్రహ్మణ్యం, హరి, రాఘవ, రెడ్డి, రవి, చంద్ర, శివ, కేశవ రెడ్డి, శివ రెడ్డి, రాజా రెడ్డి, శ్రీనివాసులు, సుమన్, శంకర్ రాజు తదితరులు పాల్గొని కొత్త పెన్షన్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మామిడి రైతులను గత ప్రభుత్వమే నిర్లక్ష్యం చేసింది

## - పెద్దిరెడ్డిపై టీడీపీ నేతల విమర్శలు

**పుంగనూరు,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బుధవారం మీడియా సమావేశం నిర్వహించి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.ఇటీవల తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మామిడి రైతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్యాయం చేస్తున్నారని చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని వారు పేర్కొన్నారు.మార్కెట్ యార్డ్ చైర్మన్ సమీపతి యాదవ్, మండల టిడిపి నాయకులు మాధవరెడ్డి, పట్టణ నాయకులు సి.వి.రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది మామిడి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.190 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. రైతులకు కిలో మామిడిపై రూ.4 సబ్సిడీ అందిస్తున్న విషయాన్ని పెద్దిరెడ్డి గుర్తుంచుకోవాలని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో చౌడేపల్లి, సోమల, దామలచెరువు ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న మామిడి మండీలను బలవంతంగా తొలగించారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు సమీపంలోనే మామిడి మార్కెట్లను ఏర్పాటు చేసి, తమ పంటకు మెరుగైన ధర లభించేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు.మామిడి రైతులకు అన్యాయం చేసింది ప్రస్తుత ప్రభుత్వం కాదని, గత ప్రభుత్వమే రైతుల ప్రయోజనాలను విస్మరించిందని పేర్కొన్నారు.ఇకనైనా మామిడి రైతులను తప్పుదోవ పట్టించేలా అసత్య ఆరోపణలు, ధర్నాలు, రాస్తారోకోలు, తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వారు సూచించారు. వాస్తవాలు ప్రజలకు తెలుసని, ఇటువంటి రాజకీయ ఆరోపణలను ప్రజలు విశ్వసించరని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీ గిరి, దేశాధి ప్రకాష్, శ్రీకాంత్, చైతన్య రాయల్, రాంబాబు, హరి తదితరులు పాల్గొన్నారు.

# అక్షర స్కూల్లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

**రామకుప్పం, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామకుప్పం అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా. లోకేష్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఒక సేవ. ప్రాణాలను కాపాడే వైద్యుల త్యాగం వెలకట్టలేనిది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవాలి అని అన్నారు. చిన్నప్పటి నుండే ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాల పరిశుభ్రత వంటి అలవాట్లను విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ, సమాజంలో వైద్యుల పాత్ర కీలకం. రోగులకు భరోసా ఇచ్చి ధైర్యం చెప్పే వైద్యులే నిజమైన హీరోలు. డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ గారి సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా జూలై 1న డాక్టర్స్ డే జరుపుకుంటున్నాం అని తెలిపారు. విద్యార్థులంతా భవిష్యత్తులో వైద్య వృత్తిని ఎంచుకొని సమాజ సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్ల వేషధారణలో వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. వైద్యుల సేవలను కొనియాడుతూ పాటలు, ప్రసంగాలు చేశారు. డా. లోకేష్ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి సీనియర్ నేత మోహన్ రాజ్ జన్మదిన వేడుకలు


## - చిత్తూరు ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కట్ చేసిన మోహన్ రాజ్



**చిత్తూరు,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి, టిడిపి సీనియర్ నేత మోహన్ రాజ్ 62 వ జన్మదిన వేడుకలను చిత్తూరు నగరంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ క్రమంలో స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని చిత్తూరు ఎమ్మెల్యే ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సమక్షంలో మోహన్ రాజ్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకు మోహన్ రాజ్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక మిట్టూరులోని చిత్తూరు రూరల్ మండల టిడిపి కార్యాలయంలో మండల పార్టీ శ్రేణుల సమక్షంలో మోహన్ రాజ్ జన్మదిన కేక్ కట్ చేసి అభిమానులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. మధ్యాహ్నం అందరూ విందు భోజనాలు ఆరగించి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మేషక్, మండల పార్టీ నాయకులు శశికుమార్, శ్యామ్, పార్టీ చిత్తూరు నగర అధ్యక్షులు నరేష్ కుమార్ తోపాటు పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

# అపోలో యూనివర్సిటీకి కొత్త వీసీ బాధ్యతల స్వీకరణ

## - ప్రో వీసీగా డా. అల్ఫ్రెడ్.. ఎఐఎంఎస్ఆర్ డీన్‌గా డా. రమ్యా రామకృష్ణన్



**చిత్తూరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ది అపోలో యూనివర్సిటీలో బుధవారం నాయకత్వ మార్పు జరిగింది. విశిష్ట సేవలందించిన వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు, విద్యా పరిపాలనాధికారి డాక్టర్ నితిన్ ఎం. నాగర్‌కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఎఐఎంఎస్ఆర్) డీన్‌గా పనిచేసిన డాక్టర్ అల్ఫ్రెడ్ జె. అగస్టీన్ ప్రో వైస్ చాన్సలర్ (అకడమిక్స్)గా బాధ్యతలు చేపట్టగా, ఆయన స్థానంలో డాక్టర్ రమ్యా రామకృష్ణన్ ఎఐఎంఎస్ఆర్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన ముగ్గురు అధికారులను అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెడ్ ఎస్. బాలరాజు, రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్., డీన్లు, అధ్యాపకులు, వైద్యులు, అధికారులు, సిబ్బంది ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

**వైద్య, విద్యారంగాల్లో విశేష అనుభవం**

నూతన వైస్ చాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్‌కర్‌కు వైద్య, విద్యా, పరిపాలనా రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ప్రముఖ ఈఎన్‌టీ, తల--మెడ శస్త్రచికిత్స నిపుణుడైన ఆయన ఎయిమ్స్ రాయ్‌పూర్ డైరెక్టర్‌గా 11 సంవత్సరాల పాటు సేవలందించారు. అనంతరం ఎయిమ్స్ భోపాల్ అదనపు బాధ్యతలు నిర్వహించడంతో పాటు ఇటీవల ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రో వైస్ చాన్సలర్ (మెడికల్ అండ్ హెల్త్ సైన్సెస్)గా పనిచేశారు. ఆయన పేరుతో 100కు పైగా పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. పాట్నా యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్, పీజీఐఎంఈఆర్ -- చండీగఢ్ నుంచి ఈఎన్‌టీలో ఎంఎస్, డీఎన్‌బీ పట్టాలు పొందారు. ఎఐఎంఎస్ఆర్‌కు సుదీర్ఘకాలం డీన్‌గా సేవలందించిన డాక్టర్ అల్ఫ్రెడ్ జె. అగస్టీన్ ప్రో వైస్ చాన్సలర్ (అకడమిక్స్)గా బాధ్యతలు స్వీకరించగా, ఎఐఎంఎస్ఆర్‌లో అసోసియేట్ డీన్ (అకడమిక్స్)గా పనిచేస్తున్న డాక్టర్ రమ్యా రామకృష్ణన్‌కు పదోన్నతి లభించి డీన్‌గా బాధ్యతలు చేపట్టారు.

# చిత్తూరు జిల్లా

# కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి

## - నాలుగు వార్డుల్లో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



**చిత్తూరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. బుధవారం ఉదయం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 5, 10, 39 37 వార్డుల్లో లబ్ధిదారుల ఇంటికి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. తెలుగుదేశం, జనసేన, భాజపా నాయకులతో కలిసి లబ్ధిదారుల వద్దకే వెళ్లారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులను, మంచానికే పరిమితమైన వారిని ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పింఛను సొమ్ములను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సత్వరం పెంచి ఇస్తున్న పింఛను సొమ్ములు కారణంగా లక్షలాది కుటుంబాలకు ఆసరా లభిచిందన్నారు. చాలా మంది లబ్ధిదారులు పింఛను సొమ్ములు పెంచి ఇస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు చెప్తుడడంతో సంతోషంగా ఉందన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్రజలకు మంచి పనులు.. మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పి నరసింహప్రసాద్, చుడ చైర్ పర్సన్ కఠారి హేమలత, సహాయ కమిషనర్ ఎ. ప్రసాద్, కూటమి నాయకులు బీఎన్ రాజసింహులు, కవిత, అముద, రాజేష్ కుమార్ రెడ్డి, నరేష్, క్లస్టర్, డివిజన్ ఇన్చార్జులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్లకు ఘన సన్మానం



**పలమనేరు ,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పలమనేరు ఆధ్వర్యంలో బుధవారం పలమనేరు పట్టణంలోని గంగమ్మ గుడి తోపు భవనంలో బాస్ భవనం నందు డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలమనేరు పట్టణం నందు డాక్టర్ లక్ష్మీనారాయణ శెట్టి ఊపిరితిత్తుల వైద్య నిపుణులు ను సాలువతో ఘనంగా సన్మానించి పూలమాలలువేసి పండ్ల బొకే ను అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ సమావేశంలో డాక్టర్ లక్ష్మీనారాయణ మన సభ్యులందరికీ డాక్టర్స్ డే ఎలా వచ్చింది అలాగే డాక్టర్ బీసీ రాయ్ గురించి సమాజానికి వారు చేసినటువంటి సేవలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణమ్మ గారి జనార్దన్ ఆధ్వర్యంలో జరిగింది. పలమనేరు సభ్యులు అరుణ ప్రసన్న, రెహనాభి కైరునిస సల్మా, సుజాత, సునీత ,మంజుల రజనీకాంత్,అన్నపూర్ణ ,చరణ్ మనోహర్. హేమగిరి కిషోర్, వాసుదేవన్,యేసురాజు, రానా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్స్ డే




**పలమనేరు , జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** క్రిష్ణమ్మ గారి జీ వ న ధా ర ఫౌ ం డే ష న్ ఆధ్వర్యంలోజాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మా ఫౌండేషన్ ద్వారా గంటావూరు కాలనీ యందు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు వైద్య సేవలు అందిస్తున్న వైద్య నిపుణులు డాక్టర్ మౌనిక సెల్లస్ కి క్రిష్ణమ్మ గారి జీవన ధార ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు క్రిష్ణమ్మ గారి జనార్ధన్ వెళ్లి వారిని కలిసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమెకు సాలువ కప్పి ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేసి టీడీపీని గెలిపిద్దాం:

## - మండల అధ్యక్షుడు వెంకటరమణ



**రామకుప్పం,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామకుప్పం పట్టణ టీడీపీ యూనిట్ ముఖ్య నేతల విస్తృతస్థాయి సమావేశం బుధవారం స్థానిక సుబ్రమణ్యస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించారు.ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై లోతుగా చర్చించారు,ఈ సందర్భం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, యూనిట్ ఇంచార్జి సీతాపతి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లే బాధ్యత మనపై ఉంది. నాయకులంతా విభేదాలు పక్కనపెట్టి సమన్వయంతో పనిచేయాలి. బూత్ కమిటీలే పార్టీకి పునాది. బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్టం చేస్తేనే రాబోయే అన్ని ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుంది" అని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు,కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. ముఖ్యంగా పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ఉచిత ఇసుక, పాడి రైతులకు సబ్సిడీ దాణా వంటి పథకాలపై విస్తృత ప్రచారం చేయాలిని సూచించారు. కో-యూనిట్ ఇంచార్జి రామకృష్ణప్ప పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని కోరారు., ఈ కార్యక్రమంలో కో యూనిట్ జి రామకృష్ణప్ప, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, కుప్పం నియోజకవర్గం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అవినాష్ రెడ్డి, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు దయా, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, బూత్ కమిటీ కన్వీనర్లు బాలు, మంజునాథ్, చలపతి, చాంద్ బాషా, విద్యా కమిటీ చైర్మన్ శ్రీరాములు,పలువురు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు,విద్యా సామాగ్రి పంపిణీ



**కందుకూరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం అనే నినాదంతో శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ(8341221414) కందుకూరువారి ఆధ్వర్యంలో బుధవారం సొసైటీ సభ్యుల సహకారంతోపట్టణం బృందావనం కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకములు,పలకలు, పెన్సిల్స్ పంపిణీ చేయటం జరిగింది. సొసైటీ అధ్యక్షులు సేవారత్న రవ్వా శ్రీనివాసులు (ఎల్ ఐ సి & స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్)మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఎన్నో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారికి అవసరమైన విద్యాసామాగ్రిని మా సంస్థ ద్వారా అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నామని,ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం కూడా మధ్యాహ్న భోజనం, యూనిఫామ్,బ్యాగులు, పుస్తకములు తదితర వస్తువులు అందజేయటం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఈ.సి.మెంబర్లు మోదడుగు శ్రీనివాసరావు, చిన్ని వెంకట నాగసాయి పూర్ణ తేజ, పబ్బుశెట్టి పవన్ కుమార్,ఉపాధ్యాయులు ఇందిరా రాణి,స్వప్న పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై వైకాపా ఆధ్వర్యంలో విస్తృత అవగాహన

**- సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ ముమ్మర పర్యటన**



**మదనపల్లె, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్ పరిశీలించారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని 158,160 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు), కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిసార్ అహమద్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ విజయవంతం కావడంలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఏలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత కీలకమైన బాధ్యత నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడంలో వీరి పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజలందరికీ తగిన అవకాశం కల్పించే ఉద్దేశ్యంతో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరింత పొడిగించాలని ఎన్నికల సంఘం మరియు సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ నూర్ ఆజాం, ఈశ్వర్ నాయక్, బూత్ కమిటీ అధ్యక్షులు ఎన్.నవాజ్, గ్రానైట్ మహేష్, నాగమణి, అమ్మాజాన్, బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏ లు), పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణకు పచ్చదనమే ముఖ్యం

**-'నగరవనం'ను వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**- 50 వేల మొక్కలు నాటడమే లక్ష్యం : ఎమ్మెల్యే షాజహాన్ బాషా**



**మదనపల్లె, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణకు పచ్చదనమే అత్యంత ముఖ్యమని అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 'నగరవనం'లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లె పట్టణంలో ఏర్పాటు చేసిన 'నగరవనం'ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానికంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తు చేశారు. అందులో భాగంగా మదనపల్లె పట్టణంతో పాటు చుట్టుపక్కల రహదారుల్లో 50 వేల మొక్కలు నాటేందుకు ఒక ఉద్యమంలా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం సోషల్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుంచి 50 వేల మొక్కలను కోరామని, అటవీ శాఖ అధికారులు ఇందుకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "ప్రతి విద్యార్థి బాధ్యతగా రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి. భవిష్యత్తులో ఆ మొక్కలే మన మనుగడకు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆలంబనగా నిలుస్తాయని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. కార్యక్రమంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గంగారపు నవీన్ చౌదరి, ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ మదనమోహన్, ఎఫ్ఎస్ఓ శివకుమార్, మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు మోహన వల్లి, అటవీ శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి

**- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచనలు**



**మదనపల్లె: జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మానవ జీవితం ఎంతో అమూల్యమైంది, చిన్నపాటి నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రజలను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు స్టీరింగ్ ఇవ్వడం వల్ల కఠిన చర్యలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారని, అపరిచిత లింకులు క్లిక్ చేయడం, ఓటీపీలు చెప్పడం సూచించారు. ఒకవేళ ఎవరైనా మోసపోయాము అని తెలిస్తే వెంటనే 1930 కి కాల్ చేయాలని తెలియజేశారు. యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098కి, మహిళలు ఆపదలో ఉంటే తక్షణ సహాయం కోసం 112కి దయల్ చేసి పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టాలను గౌరవిస్తూ సురక్షిత అన్నమయ్య జిల్లా సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

## వైద్య వృత్తి పవిత్ర మైంది: లయన్ పటాన్ ఖాదర్ భాషా

**కడప అర్బన్ , జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని జె కె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థా పకులు లయన్ పటాన్ ఖాదర్ భాషా అన్నారు. బుధవారం నగరంలోని పాత మున్సిపాలిటీ ఎదురుగా ఎం ఎం హాస్పిటల్ అధినేత మహబూబ్ పీరా తనయుడు డాక్టర్ ఆబిద్ కు జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ కు శాలువాతో సత్కరించి మెమొంటో ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు .అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషికి పునర్జన్మ ఇచ్చేది వైద్య దేనని, వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఒక పక్క వై ద్యం వృత్తి చేస్తూ మరో పక్క ఎన్నో సామాజిక కార్యక్ర మాలు చేస్తున్నారని అన్నా రు .డాక్టర్ ఆబిద్ ఆయన కుటుంబంలో అందరూ వైద్యులే అందుకే కడప లో వారికి వైద్యుల కుటుంబమని పేరుందని చెప్పారు.

## సౌత్ జోన్ అండర్-16 మల్టీ డేస్ మ్యాచ్ ఆదినారాయణ రెడ్డి, సాయి యశ్వంత్ సెంచరీలు

**- తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం ఆధిక్యం**



**వాల్మీకిపురం, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్ జోన్ అండర్-16 మల్టీ డేస్ మ్యాచుల్లో భాగంగా వాయల్పాడు సీడీసీఏ--జీవీఎస్‌సీఎస్ గ్రౌండ్స్‌లోని గ్రౌండ్-2లో అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. టాస్ గెలిచిన అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని తొలి ఇన్నింగ్స్‌లో 93 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 332 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఆర్. ఆదినారాయణ రెడ్డి 211 బంతుల్లో 110 పరుగులు చేసి అద్భుత సెంచరీ సాధించారు. పంకజ్ మీనా 104 బంతుల్లో 58 పరుగులు, ఎ.ఎస్. ఆహిల్ రాజా 89 బంతుల్లో 65 పరుగులు, ఎం. దేవాంశు యోగి 50 బంతుల్లో 34 పరుగులు చేయగా, వై. లిఖిత్ 44 బంతుల్లో 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. నెల్లూరు బౌలర్లలో ఎస్. సాకేత్ 77 పరుగులకు 4 వికెట్లు పడగొట్టగా, ఎ. శ్రీచరణ్, వి. యశ్వంత్ చెరో వికెట్ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 81.5 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌటైంది. పి. సాయి యశ్వంత్ 182 బంతుల్లో 137 పరుగులు చేసి సెంచరీతో రాణించగా, జి. సాయి శౌర్య రెడ్డి 101 బంతుల్లో 33 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లలో ఎం. దేవాంశు యోగి 3 వికెట్లు (69 పరుగులు), కె. శామీర్ 3 వికెట్లు (76 పరుగులు), వై. లిఖిత్ 2 వికెట్లు (57 పరుగులు), పి. రెహాన్ ఒక వికెట్ (67 పరుగులు) సాధించి నెల్లూరు ఇన్నింగ్స్‌ను కట్టడి చేశారు. ఈ వివరాలను సీడీసీఏ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ వెల్లడించారు. మ్యాచ్‌కు చిత్తూరు జిల్లా హెడ్ కోచ్ సునీల్ కుమార్ పర్యవేక్షణ అందిస్తున్నారు.

## గ్రామసభలో పీలేరు అభివృద్ధి పనులపై సమీక్ష



**పీలేరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు గ్రామం పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభ లో పీలేరు గ్రామపంచాయతీ యొక్క అభివృద్ధి మరియు పంచాయతీ ఆర్థిక పరిస్థితిని చేసినటువంటి మురికినీటి కాలువలు సిమెంట్ రోడ్లు వీధి దీపాలు దాదాపు ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు కోట్ల రూపాయలతో పట్టణఅభివృద్ధి చేయడమైనది అని తెలిపారు పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కృషితో అయ్యప్ప నాయన చెరువు సుందరీ కరణ పనులను ,రైల్వే ఓవర్ బ్రిడ్జిలు యొక్క నిర్వహణపై కాంట్రాక్టర్లను గ్రామ పెద్దలు తీవ్రంగా స్పందించడమైనది త్వరగా ఆర్ఓబి పనులను పూర్తి చేయాలని కోరడమైనది పట్టణ పరిసర ప్రాంతాలలో అన్ని వీధులలో పరిశుభ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలని ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరడమైనది ఈ సమావేశమునందు ఇంచార్జ్ ఈవో బ్రహ్మానంద రెడ్డి, సచివాలయ సెక్రెటరీలు జ్ఞాన శేఖర్ శివాజీలు, పీలేరు పట్టణ తెలుగుదేశం నాయకులు మీడియా కోఆర్డినేటర్ పోలిశెట్టి సురేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంచి సూరి , అంకాలమ్మ గుడి చైర్మన్ రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జీవనశైలి వ్యాధులపై అవగాహన సదస్సు




**పీలేరు, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పీలేరులోని సి యన్ ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు "జీవనశైలి వ్యాధులు -- నివారణే ఉత్తమ చికిత్స" అనే అంశంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పీలేరు సహకారంతో ప్రముఖ వైద్యులచే ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. ఆర్. రాజాసాబ్, అధ్యక్షులు, పీలేరు మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం, అధిక ఒత్తిడి కారణంగా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు యువతలో వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. సమతుల్య ఆహారం, ప్రతిరోజూ వ్యాయామం, తగిన నిద్ర, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధులను చాలావరకు నివారించవచ్చని పేర్కొన్నారు. డా. ఎం. చంద్రశేఖర్ నాయక్, కార్యదర్శి, పీలేరు మాట్లాడుతూ, "నివారణ చికిత్స కంటే గొప్పది" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండేలా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డా. పి. చంద్రశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్, పీలేరు మాట్లాడుతూ, విద్యార్థి దశలో ఏర్పడే మంచి అలవాట్లే జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. డా. ఎం. నాగవేణి, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ మాట్లాడుతూ, సరైన పోషకాహారం, మానసిక ప్రశాంతత, తగిన నిద్ర, యోగా, ధ్యానం వంటి అలవాట్లు జీవనశైలి వ్యాధుల నివారణకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. డా. టి. జె. రమ్య, సివిల్ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడుతూ, ఫాస్ట్ ఫుడ్, శీతల పానీయాలు, అధిక చక్కెర, అధిక ఉప్పు వినియోగాన్ని తగ్గించి, ప్రతిరోజూ కనీసం 30--45 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లే మంచి భవిష్యత్తుకు పెట్టుబడిగా నిలుస్తాయని అన్నారు. డా. ఎస్. జంషీర్, మెడికల్ ఆఫీసర్ , ఏరియా హాస్పిటల్, పీలేరు మాట్లాడుతూ, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి అంటురాని వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని వివరించారు. డా. వి. రామ్‌మోహన్ రెడ్డి, దంత వైద్య నిపుణులు, సాయి డెంటల్ హాస్పిటల్, పీలేరు మాట్లాడుతూ, నోటి ఆరోగ్యం మొత్తం శరీర ఆరోగ్యానికి అద్దం పడుతుందని తెలిపారు. రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం, ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్ష చేయించుకోవడం అవసరమని సూచించారు. ఈ సందర్భంగా సియన్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీ విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సమాజ ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం సేవలందిస్తున్న వైద్యులకు కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపైనా సమాన శ్రద్ధ చూపాలని, నేటి యువతలో పెరుగుతున్న జీవనశైలి వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. వైద్యులు అందించిన సూచనలు విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమగ్ర వికాసం కోసం ఇటువంటి సామాజిక, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను కళాశాలలో నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు వైద్యులను ఆరోగ్యానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. జీవనశైలి వ్యాధుల నివారణపై వైద్యులు అందించిన సూచనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో డా. ఆర్. రాజాసాబ్, డా. ఎం. చంద్రశేఖర్ నాయక్, డా. పి. చంద్రశేఖర్, డా. ఎం. నాగవేణి, డా. టి. జె. రమ్య, డా. ఎస్. జంషీర్, డా. వి. రామ్‌మోహన్ రెడ్డి, లయన్ సి. సురేంద్ర రెడ్డి (కార్యదర్శి), లయన్ పి.వి. రమణ (కోశాధికారి), లయన్స్ క్లబ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మహేష్, సత్య మూర్తి, సురేంద్రనాథ్ రెడ్డి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన సియన్‌ఆర్ డిగ్రీ కళాశాల యాజమాన్యాన్ని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు ప్రతినిధులను, ఏరియా హాస్పిటల్ మరియు సాయి డెంటల్ హాస్పిటల్ వైద్య బృందాన్ని పలువురు అభినందించారు.



# అన్నమయ్య జిల్లా

## రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లె, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలోని రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జి. జయలక్ష్మితో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రీ సర్వే , పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, 22-ఏ భూముల సమస్యల పరిష్కారం, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, అటవీ భూములకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా ఘనంగా హెల్తీ 5కే రన్ నిర్వహణ



**కలికిరి, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డాక్టర్స్ డే సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు, కపిలేశ్వర హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం కలికిరి క్రాస్ రోడ్స్ నుంచి హెల్తీ 5కే రన్ ఘనంగా నిర్వహించారు. సుమారు 250 మంది వైద్యులు, దంత వైద్యులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాల్గొన్న వారికి ముందుగా రిజిస్ట్రేషన్ నిర్వహించి రన్నింగ్ నంబర్లు అందజేశారు. అనంతరం కలికిరి సీఐ అనిల్ రోడ్డు భద్రతా సూచనలు వివరించి పచ్చజెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. రన్‌కు పోలీసు భద్రత, అంబులెన్స్ సేవలు, ప్రతి 500 మీటర్లకు హైడ్రేషన్ పాయింట్లు ఏర్పాటు చేసి తాగునీరు, గ్లూకోజ్-డి నీరు అందుబాటులో ఉంచారు. రన్ ముగిసిన అనంతరం కపిలేశ్వర హాస్పిటల్‌లో విజేతలకు మెడల్స్ ప్రదానం చేశారు. ముఖ్య అతిథి బ్రిగేడియర్ అనుపమ్ శర్మ (డి .ఐ.జి, సి.ఐ.ఏ.టి - 03,సి.ఆర్.పి.ఎఫ్) వైద్యుల సేవలను కొనియాడుతూ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సైనిక్ స్కూల్ ఫస్ట్ లేడీ కమలాజిత్ కౌర్ మాట్లాడుతూ వైద్యులు తమ ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలని సూచించారు. మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గులాబ్ జాన్ ఆరోగ్యవంతమైన జీవనశైలికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఐ ఎం ఏ పీలేరు అధ్యక్షుడు డా. ఆర్. రాజాసాహెబ్ కార్యక్రమ విజయానికి సహకరించిన కపిలేశ్వర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. శివప్రసాద్ సి.వి., ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా. వై. పవన్ కుమార్‌తో పాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవా కోఆర్డినేటర్ డా. కె. లోకవర్ధన్, పీలేరు ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్య చైతన్య కార్యక్రమాలకు తమ సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు. "మన ఆరోగ్యం - మన బాధ్యత" అనే సందేశంతో నిర్వహించిన ఈ హెల్తీ 5కే రన్ డాక్టర్స్ డే వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సహకార వారోత్సవాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

**కలికిరి, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సహకార వారోత్సవాల్లో భాగంగా కలికిరి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సహకార బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు డైరెక్టర్లు అల్లాబక్షు, సుబ్బయ్య, సంఘం సీఈఓ కొండప్ప, జూనియర్ ఇన్‌స్పెక్టర్ దీప, సిబ్బంది గౌస్, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సిబ్బాల దినకర్, వెంట నారాయణరెడ్డి, రాజారెడ్డి, రమణ పాల్గొన్నారు. వైద్య బృందంలో డాక్టర్ కావ్య గంధ, సూపర్‌వైజర్ సుదీకర్, సీహెచ్‌వో పావని, షరీఫా, ఎంపీహెచ్ఏ నఫీజా, ఆశా వర్కర్లు లక్ష్మిదేవి, నాగవేణి తదితరులు సేవలందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మండలంలోని పలువురు ప్రజలు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, ఉచిత మందులు పొందారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను స్థానికులు అభినందించారు.

## జయప్రకాశ్, దినేష్ ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో కడప ఆలౌట్



**వాల్మీకిపురం, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్ జోన్ అండర్-16 మల్టీ డేస్ క్రికెట్ టోర్నీలో వాయల్పాడు సీడీసీఏ--జీవీఎస్‌సీఎస్ గ్రౌండ్స్‌లోని గ్రౌండ్-1లో చిత్తూరు, కడప జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 71.5 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌట్ అయింది. కె. లోకేష్ 145 బంతుల్లో 67 పరుగులు, ఎస్.కె. ఉమర్ సిద్ధిక్ 49 బంతుల్లో 59 పరుగులు, పి. హితేష్ సాయి 96 బంతుల్లో అజేయంగా 65 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లలో రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ జయప్రకాశ్ 93 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి రాణించగా, తేజేష్, దినేష్ తలో రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 35 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయింది. వి.జె. నోయెల్ 48 బంతుల్లో 45 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కడప బౌలర్లలో ఎమ్. వర్షిత్ కుమార్ 34 పరుగులకు 4 వికెట్లు, పి. హితేష్ సాయి 56 పరుగులకు 4 వికెట్లు పడగొట్టగా, బి. ముని జ్ఞానేశ్వర్, సి.ఎండీ. ఫైజాన్ తలో వికెట్ సాధించారు. ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టును చిత్తూరు బౌలర్లు మరోసారి కట్టడి చేశారు. జయప్రకాశ్ 58 పరుగులకు 3 వికెట్లు, ఆఫ్‌బ్రేక్ బౌలర్ దినేష్ 48 పరుగులకు 4 వికెట్లు తీసి విజృంభించడంతో కడప జట్టు 64.3 ఓవర్లలో 222 పరుగులకు ఆలౌట్ అయింది. కె. లోకేష్ 97 బంతుల్లో 50 పరుగులు, యువ్.వి. శివచరణ్ 73 బంతుల్లో 37 పరుగులు, పి. అస్కాన్ ఖాన్ 104 బంతుల్లో 46 పరుగులు, ఎ. సాయి అభినివేష్ 51 బంతుల్లో 31 పరుగులు చేశారు.
ఈ వివరాలను సీడీసీఏ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లా జట్టుకు హెడ్ కోచ్ సునీల్ కుమార్ పర్యవేక్షణ చేస్తున్నారు.

## అనారోగ్యంతో విద్యార్థిని మృతి.. గ్రామంలో విషాదం



**రామసముద్రం, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలం చెంబకూరు గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డివారిపల్లి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని తేజశ్రీ (18) అనారోగ్యంతో బుధవారం మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన రామచంద్ర, కళావతమ్మ (జెడ్పీ హైస్కూల్ చైర్మన్) దంపతుల కుమార్తె తేజశ్రీ మదనపల్లెలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ తొలి సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూసింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామస్థులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాగా చదివి ఉన్నత ఉద్యోగం సాధిస్తుందని ఆశించిన తమ కూతురు అకాల మరణం తీరని లోటని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తోటి విద్యార్థులు తేజశ్రీ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మంచి స్నేహితురాలిని కోల్పోయామని కన్నీటి పర్యంతమయ్యారు.

# ఆన్‌లైన్ హోటల్ బుకింగ్ పేరుతో మోసం

**: విజయవాడలో రూ.20 వేలు పోగొట్టుకున్న బాధితుడు**



**విజయవాడ జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలో ఆన్‌లైన్ హోటల్ బుకింగ్ పేరుతో ఒక వ్యక్తి దారుణంగా మోసపోయాడు. భవానీపురానికి చెందిన అబ్దుల్ రహీమ్ ఈ నెల 11న ఒక రిసార్ట్‌లో గదిని బుక్ చేసుకోవాలని అనుకున్నారు. ఇందులో భాగంగా గూగుల్‌లో శోధించగా, ఒక వెబ్‌సైట్‌లో వాట్సాప్ బుకింగ్ లింక్ కనిపించింది.ఆ లింక్ ద్వారా అందులో ఉన్న ఒక ఫోన్ నంబర్‌ను రహీమ్ సంప్రదించారు. రూమ్ రిజర్వేషన్ కోసం రూ. 20 వేలు ముందస్తుగా జమ చేయాలని అవతలి వ్యక్తి కోరగా, నమ్మిన బాధితుడు ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశాడు. డబ్బులు పంపిన తర్వాత అవతలి వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో, తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని రహీమ్ గ్రహించారు.దీనిపై బాధితుడు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గుర్తుతెలియని లింకులు, వాట్సాప్ నంబర్ల ద్వారా నగదు లావాదేవీలు జరిపేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోర ప్రమాదం

**: లారీ కిందపడి వాహనదారుడు మృతి.. కారు నుజ్జునుజ్జు**



**విజయవాడ జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ: నగర శివార్లలోని విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గొల్లపూడి నుంచి గన్నవరం వెళ్లే జాతీయ రహదారిపై ఉన్న బీబీ గూడెం వద్ద వేగంగా వచ్చిన ఒక లారీ బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒక వాహనదారుడు లారీ టైర్ కింద పడి అక్కడికక్కడే అత్యంత దారుణంగా మృతి చెందాడు.అదే సమయంలో ఓ కారును లారీ బలంగా ఢీకొట్టడంతో ఆ కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో సదరు కారులో ఒక తల్లి, ఆమె కూతుళ్లు ఉన్నట్లు సమాచారం అందుతోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. కారులో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారు.ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో, ఈ ఘటనలో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

# మండల విజిలెన్స్ కమిటీ సభ్యులుగా సీనియర్ జర్నలిస్ట్, ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ఏవో భాష



**ఇబ్రహీంపట్నం జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కొండపల్లి పరిధిలో సివిల్ సప్లై అక్రమాలు నివారించుటకు ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో చైర్మెన్ గా విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు అధికారులు, ప్రజా ప్రతినిధులు తో పాటు జర్నలిస్ట్ కోటలో ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సుదీర్ఘ జర్నలిజం అనుభవం ఉన్న బిగ్ టీవీ రిపోర్టర్ షేక్ బాషా కు సభ్యులుగా నియమించారు... ఎలక్ట్రానిక్ మీడియాలో సుదీర్ఘ అనుభవం, అందరివాడు, వివాద రహితుడు, అజాతశత్రువు, భాషా నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**మార్కాపురం జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పట్టణంలోని నాయుడు వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మొదటి రోజు వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్.నారాయణరావు, తదితరులు ఉన్నారు .

# ఇద్దరికి ఎల్.ఓ.సీలు అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**విజయవాడ జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు గారు ఇద్దరు లబ్ధిదారులకు వైద్య చికిత్స కోసం మంజూరైన ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)లను అందజేశారు. కొరం పృథ్వీరాజ్ (గుంటుపల్లి)కు రూ.3,83,339 విలువైన ఎల్.ఓ.సీని, పామర్తి వీరబాబు (కొత్తూరు తాడేపల్లి)కు రూ.1,15,776 విలువైన ఎల్.ఓ.సీని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు స్వయంగా అందించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్యానికి దూరం కాకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్.ఓ.సీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎల్.ఓ.సీలు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తమకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించిన సీఎం చంద్రబాబు గారికి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైలవరం నియోజకవర్గంలో రూ.18.31 కోట్ల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రారంభం



**మైలవరం, జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనంతవరంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ నియోజకవర్గంలోని 5 మండలాల్లో 42,142 మందికి రూ.18.31 కోట్లు పంపిణీ మైలవరం మండలం: 9,349 మందికి రూ.4.05 కోట్లు, జి.కొండూరు: 8,362 మందికి రూ.3.61 కోట్లు 7,594 మందికి రూ.3.31 కోట్లు, రెడ్డిగూడెం: 7,026 మందికి రూ.3.01 కోట్లు కొండపల్లి: 5,153 మందికి రూ.2.28 కోట్లు, ఇబ్రహీంపట్నం: 4,658 మందికి రూ.2.01 కోట్లు మంజూరు రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు వివిధ కేటగిరీలలో పింఛన్లు: ఎమ్మెల్యే వసంత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అత్యధిక పింఛన్లు ఇస్తున్నాం: ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సూపర్ సిక్స్ హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే వసంత ఎన్టీఆర్ భరోసా, దీపం-2.0, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు చేస్తున్నాం అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో పేదల కడుపు నిండుతోంది: ఎమ్మెల్యే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ సమన్వయంతో రాష్ట్రాభివృద్ధి అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా కొనసాగుతోంది: ఎమ్మెల్యే వసంత కార్యక్రమంలో పాల్గొన్న జనసేన ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), అధికారు

# ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ కు అదనపు సిబ్బంది కావాలి

**ప్రజల భద్రత కోసం ఉన్నతాధికారులకు ప్రజల వినతి**



**ఇబ్రహీంపట్నం, జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు ఉన్న ఈ ప్రాంతంలో ప్రస్తుత సిబ్బందితో ట్రాఫిక్ ని పూర్తిగా కంట్రోల్ చేయడం కష్టంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండనక, వాననక, పండగలప్పుడు కూడా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సేవలు మరువలేనివి. అయితే పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ విభాగానికి అదనపు సిబ్బందిని కేటాయించాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఇబ్రహీంపట్నంలో ఉదయం, సాయంత్రం పూట స్కూల్, కాలేజీ విద్యార్థులు, ఆఫీస్ కి వెళ్లే ఉద్యోగులు, వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది.

ప్రజల ప్రధాన డిమాండ్లు:

ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ విభాగానికి అదనపు సిబ్బందిని కేటాయించాలి. ప్రస్తుతం ముగ్గురు ఉన్నారు.

పీక్ అవర్స్ లో ప్రత్యేక ట్రాఫిక్ నిఘా ఏర్పాటు చేయాలి

ప్రజల భద్రత దృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకోవాలి

"ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యం. అదనపు సిబ్బంది ఉంటే ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థవంతంగా ఉంటుంది" అని స్థానికులు అభిప్రాయపడ్డారు.

ఇబ్రహీంపట్నం ప్రజల భద్రత కోసం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

# 3న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం: ఎంపీ బైరెడ్డి శబరి



**కర్నూలు జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రంలో ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పండగ కొనసాగుతుందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. నగరంలోని 36వ వార్డు వాసవీ నగర్‌లో ఆమె ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ నెల 3వ తేదీన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కడప స్టీల్ ప్లాంట్‌పై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమ బిడ్డ అని పేరు చెప్పుకున్న జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రాంతానికి ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో తెదేపా జెండా ఇంకా 30 ఏళ్లు ఎగురుతూనే ఉంటుందని ఎంపీ అన్నారు. రాష్ట్రంలో కేవలం తెదేపా పాలనలో అభివృద్ధి జరిగిందన్నారు. ఎంపీ వెంట తెదేపా సీనియర్ నాయకులు మల్లెల పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

# అనంతపురంలో నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హల్‌చల్



**కమలానగర్ (అనంతపురం) జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనంతపురంలో నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హల్‌చల్ చేశాడు. నగరంలోని ఎస్పీ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న ఓ కిరాణా దుకాణంలోకి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌నంటూ శివ కుమార్ అనే వ్యక్తి తనిఖీలు చేస్తూ హంగామా సృష్టించాడు. అనుమతి లేకుండా సిగరెట్లు ఎలా విక్రయిస్తున్నారని ఫైన్ కట్టాలని దుకాణదారుడిని బెదిరించాడు. వెంటనే డబ్బులు ఇవ్వాలని దుకాణదారుడిని భయపెట్టడంతో పక్కనే ఉన్న డీఎస్పీ కార్యాలయ సిబ్బంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌పై ఆరా తీశారు. మెడలో ఉన్న ఐడీ కార్డును పరిశీలించి, శివకుమార్ ఓ సెక్యూరిటీ సర్వీస్ ఏజెన్సీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. మద్యం మత్తులో ఉన్న శివకుమార్ కానిస్టేబుల్‌పై తిరగబడ్డాడు. శివ కుమార్‌ను డీఎస్పీ కార్యాలయ సిబ్బంది టూ టౌన్ పోలీసులకు అప్పగించారు.

# భీమిలి జోన్ పరిధిలో ఫించనులు పంపిణీ



**భీమునిపట్నం జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భీమిలి జోన్ పరిధిలో ఫించనులు పంపిణీ కార్యక్రమము నిర్వహించారు భీమిల జోన్ పరిధిలో మొత్తం పెన్షన్లు 8423, అమౌంట్ 3,69,48,500 కు గాను ఈ రోజు ఫించనులు 7729 గాను అమౌంట్ 3,39,27,500 (91.76%) పెన్షన్స్ బట్వాడా చేసారు.ఈ పింఛనుల పంపిణీ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎమ్.విజయ్ కూమార్ మరియు ఏపిడి వి. కె దొర ,ఇతర జోనల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# చిట్టినేని సుబ్బారావు గారి సేవలు ఆదర్శనీయం




**విజయవాడ , జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ పంచాయితీలో గత 36 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన జూనియర్ అసిస్టెంట్ శ్రీ చిట్టినేని సుబ్బారావు గారు మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు ముఖ్య అతిథిగా హాజరై ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసి గ్రామ పంచాయతీ అభివృద్ధికి చిట్టినేని సుబ్బారావు గారు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సుదీర్ఘ సేవా కాలంలో ఆయన నిజాయితీ, క్రమశిక్షణ, విధి నిర్వహణతో సహోద్యోగులు, ప్రజల అభిమానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిట్టినేని సుబ్బారావుకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు.అనంతరం ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, అభిమానులు పాల్గొని చిట్టినేని సుబ్బారావు సేవలను కొనియాడారు.

# ఖరీఫ్ సీజన్ పై అధికార యంత్రాంగం దృష్టి పెట్టండి

**: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**కృష్ణా డీడీఓ జ్యోతి రమణి ఎమ్మెల్యే రాముతో మర్యాదపూర్వక భేటీ**

**రైతు సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తా: ఎమ్మెల్యే రాము**

**ఎరువులు, యూరియా కొరత లేకుండా చూడండి... అధికారులకు ఎమ్మెల్యే సూచనలు**




**గుడివాడ జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రస్తుతం ప్రారంభమైన ఖరీఫ్ సీజన్ పై అధికార యంత్రం దృష్టి పెట్టాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా, గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కృష్ణా జిల్లా వ్యవసాయ అధికారి (డీడీఓ)గా బాధ్యతలు చేపట్టిన కే.జ్యోతి రమణి మంగళవారం ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీడీఓ ఎమ్మెల్యేల రాముకు పుష్పగుచ్ఛారా స్థానంలో నోట్ పుస్తకాలు అందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యేకు వివరించారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో అధికారులు చేసే కృషికి తాను పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే రాము తెలిపారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా రైతాంగానికి మేలు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు. ఎరువులు, యూరియా కొరత రాకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. గుడివాడ వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.కవిత, ఏవోలు భాను ప్రకాష్, అనంతలక్ష్మి డీడీఓ వెంట ఉన్నారు.

# జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం



**విజయనగరం జూలై 1( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. ఐదేళ్లు జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. బుధవారం విజయనగరం తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు అసెంబ్లీ సాక్షిగా రాజధానిగా అమరావతికి మద్దతు పలికి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మార్చి, ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే అర్హత, స్థాయి జగన్‌కు లేదని, ఇప్పటికైనా అసెంబ్లీకి వచ్చి చంద్రబాబులాంటి పెద్దల వద్ద ప్రజలకు మెరుగైన పాలన ఎలా అందించాలో తెలుసుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం చట్టాలను గౌరవిస్తుందన్నారు.

# వారణాసి పోస్ట్ ప్రొడక్షన్ లెక్కలు... ఇది సంగతి

టాలీవుడ్ జనాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారీ ప్రాజెక్ట్ వారణాసి రిలీజ్ డేట్ 2027 ఏప్రిల్ 7 అని ఇదివరకే లాక్ అయింది. ఉగాది పండగ సందర్భంగా ఈ సినిమాను వరల్డ్ వైడ్ గా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ పక్కా ప్లాన్ తో ఉన్నారు. అయితే ఈ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ విన్నాక అందరి మైండ్ లో మొదలైన ఒకే ఒక్క డౌట్ ఏంటంటే, అంత తక్కువ టైమ్ లో రాజమౌళి టీమ్ భారీ వీఎఫ్ఎక్స్ పనులను పూర్తి చేయగలదా అనేది. రాజమౌళి సినిమాల షూటింగ్ పూర్తయ్యాక పోస్ట్ ప్రొడక్షన్, ముఖ్యంగా గ్రాఫిక్స్ పనుల కోసం ఏళ్ల తరబడి సమయం తీసుకుంటుంటారు. కానీ ఈ సినిమాకు అక్టోబర్ 2026 కల్లా షూటింగ్ మొత్తం ప్యాకప్ చెప్పేలా కౌంట్‌డౌన్ రన్ అవుతోంది. అక్కడి నుండి ఏప్రిల్ 2027 రిలీజ్ కి చూసుకుంటే కేవలం ఐదారు నెలల టైమ్ మాత్రమే ఉంటుంది. ఈ కొద్ది కాలంలోనే ఈ గ్లోబల్ అడ్వెంచర్ సినిమా గ్రాఫిక్స్ ని పర్ఫెక్ట్ గా ఫినిష్ చేయడం నిజంగా ఒక పెద్ద సవాలే. దానికి తోడు వరల్డ్ వైడ్ ప్రమోషన్. అయితే ఈసారి రాజమౌళి ఒక రివర్స్ స్ట్రాటజీని ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. సినిమాలోని మేజర్ హై యాక్షన్ సీక్వెన్స్ ల షూటింగ్ ని ఆల్రెడీ పూర్తిగా ముగించేశారు. అంటే భారీ గ్రాఫిక్స్ అవసరమయ్యే మెయిన్ సీన్లు అన్నీ ఎప్పుడో కంప్లీట్ అయిపోయి, సమాంతరంగా వాటి వీఎఫ్ఎక్స్ వర్క్ కూడా స్టార్ట్ అయిపోయి ఉంటుంది. ప్రస్తుతం కేవలం చిన్న చిన్న కనెక్టింగ్ సీన్స్ కోసం మాత్రమే 80 రోజుల టాకీ పార్ట్ షూటింగ్ మిగిలి ఉందని తెలుస్తోంది. ఈ ప్లానింగ్ వల్ల షూటింగ్ మొత్తం ప్యాకప్ అయ్యే లోపే సగం కంటే ఎక్కువ గ్రాఫిక్స్ పనులు ఒక కొలిక్కి వచ్చేస్తాయి. సినిమాలో టైమ్ ట్రావెల్, పురాణాల బ్యాక్ డ్రాప్ ఉండటంతో పాటు ఒక భారీ వానర యుద్ధాన్ని కూడా వీఎఫ్ఎక్స్ ద్వారా చూపించబోతున్నారు. ఇలాంటి వరల్డ్ క్లాస్ విజువల్స్ ని తక్కువ టైమ్ లో అవుట్ పుట్ తీసుకురావడానికి గ్లోబల్ లెవెల్ లోని టాప్ స్టూడియోస్ ని రంగంలోకి దించారు. ప్రతీ చిన్న డిటైలింగ్ ని చెక్ చేసుకునే రాజమౌళి, ఈ ఐదారు నెలల పోస్ట్ ప్రొడక్షన్ పీరియడ్ ని డే అండ్ నైట్ షిఫ్ట్ లతో బ్యాలెన్స్ చేయబోతున్నారు. అక్టోబర్ లో టాకీ పార్ట్ క్లోజ్ అవ్వగానే కేవలం ఎడిటింగ్, ప్యాచ్ వర్క్, కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులపైనే టీమ్ పూర్తిగా ఫోకస్ పెడుతుంది. ఈ స్పీడ్ వర్క్ గనుక అనుకున్నట్లు జరిగితే ఇండియన్ సినిమా హిస్టరీలోనే అత్యంత వేగంగా గ్రాఫిక్స్ పూర్తి చేసుకున్న భారీ ప్రాజెక్ట్ గా వారణాసి రికార్డు సృష్టిస్తుంది.




## అఖిల్ మీద నమ్మకం వచ్చేసినట్టే



అయ్యగారు కంబ్యాక్ అంటూ అభిమానులే సరదాగా హాస్యమాడే అఖిల్ జూలై 10 లెనిన్ తో రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటిదాకా దీని మీద సాధారణ ప్రేక్షకుల్లో భీభత్సమైన అంచనాలు లేవు. మునుపటి సినిమాలతో పోలిస్తే ఇది బెటర్ గా ఉండొచ్చన్న అంచనా తప్ప ప్రత్యేకంగా ఆలోచించలేదు. కానీ ట్రైలర్ వచ్చాక ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. పల్లెటూరి నేపథ్యంలో విలేజ్ పాలిటిక్స్ తో పాటు ప్రేమకథ, రివెంజ్ డ్రామా పొందుపరిచిన వైనం స్పష్టంగా కనిపించింది. ఇప్పుడున్న పరిస్థితిలో ఒక మాస్ సినిమాకు రావాల్సిన బజ్ ఏదైతే ఉందో అది తెచ్చుకోవడంలో లెనిన్ సక్సెస్ అయ్యిందనే చెప్పాలి. అఖిల్ కెరీర్ లో మొదటిసారిగా ఇలాంటి డౌన్ టు ఎర్త్ పాత్ర చేయడం ఫ్యాన్స్ కి సంతోషాన్ని కలిగిస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్, సితార సంస్థలు సంయుక్తంగా నిర్మించిన లెనిన్ లో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటించగా తమన్ సంగీతం సమకూర్చారు. 90స్ మిడిల్ క్లాస్, కోర్టు, దండోరా తర్వాత శివాజికి మరో పవర్ ఫుల్ క్యారెక్టర్ పడిందట. ఇవన్నీ సానుకూలంగా అనిపిస్తున్నాయి. గ్రామీణ నేపథ్యాన్ని సరిగ్గా వాడుకుంటే ఎలాంటి అద్భుతాలు చేయొచ్చో రంగస్థలం నుంచి బలగం దాకా ఎన్నో నిరూపించాయి. పెద్దిలో ప్రీ క్లైమాక్స్ ఎమోషన్ డోస్ ఎక్కువ కాకపోయి ఉంటే అది కూడా అన్ని భాషల ఆడియన్స్ ని మెప్పించేది. అది లేకపోవడం వల్లే సక్సెస్ తెలుగు రాష్ట్రాల వరకే పరిమితమయ్యింది. నానికి దసరాలాగా అఖిల్ కి ఈ లెనిన్ నిలుస్తుందనే నమ్మకం చిత్ర బృందంలో బలంగా ఉంది.

పాజిటివ్ టాక్ వస్తే మటుకు లెనిన్ కు మంచి థియేటర్ రన్ దక్కుతుంది. ఎందుకంటే మా ఇంటి బంగారం ఆ టైంకంతా స్లో అయిపోతుంది. ఆపై వారం కూడా చెప్పుకోదగ్గ రిలీజులు లేవు. సో లెనిన్ కనక పబ్లిక్ పల్స్ పట్టుకుంటే వసూళ్ల పండగే. కథలో చాలా ట్విస్టులు ఉంటాయని, ట్రైలర్ ని బట్టి కథ మీద ఒక అంచనాకు వచ్చేయడం తప్పని స్క్రీన్ మీద చూశాక ఋజువవుతుందని టీమ్ కాన్ఫిడెన్స్. దర్శకుడు మురళికిషోర్ నిజంగా అంత మేజిక్ చేస్తే మంచిదే.

# వంద కోట్లు కొట్టగలవా బంగారం ?




జూన్ నెలలో ఊహించిన దానికన్నా చాలా పెద్ద హిట్టుగా నిలిచిన సమంత మా ఇంటి బంగారం కొన్నవాళ్లకు, డిస్ట్రిబ్యూట్ చేసినవాళ్లకు అందరికీ లాభాలు ఇచ్చింది. మొదటి షో పడకముందే నిర్మాతలు సేఫ్ లో ఉన్న విషయాన్ని రాజ్ నిడిమోరు స్వయంగా చెప్పేశారు. ప్రస్తుతం డెబ్భై అయిదు కోట్లు దాటేసిన ఈ యాక్షన్ కం ఫ్యామిలీ మూవీ వంద కోట్ల క్లబ్బులో చేరుతుందా లేదానే దాని మీద అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇది జరిగితే అద్భుతమే. ఇప్పటికైతే వీక్ డేస్ లోనూ మా ఇంటి బంగారం డీసెంట్ గా ఉంది. అన్ని చోట్ల షెడ్యూల్ చేసిన షోలన్నీ పడుతున్నాయి. జనం రాలేదని ఆపేసినవి దాదాపు లేవు. అంటే క్లాసు మాస్ ఇద్దరికీ బెస్ట్ ఆప్షన్ ఇదే అయిపోయింది. వారాంతంలో కొంచెం సౌండ్ చేయడం మినహా పెద్ది థియేటర్ రన్ ముగిసిపోయింది. ఓటిటి స్ట్రీమింగ్ ఇంకా టైం ఉన్నప్పటికీ దాని వల్ల అద్భుతాలు జరగకపోవచ్చు. నైజామ్ లో ఈ రోజు నుంచి సింగల్ స్క్రీన్లలో 50 నుంచి 105 రూపాయల టికెట్లు అందుబాటులో తెచ్చారు. కేవలం హీరోయిన్ ఇమేజ్ మీద నడిచిన టాలీవుడ్ సినిమాలు ఇప్పటిదాకా వంద కోట్ల క్లబ్బులో చేరిన దాఖలాలు లేవు. అరుంధతి వచ్చిన టైంలో టికెట్ రేట్లు ముప్పై నుంచి యాభై రూపాయల లోపే. ఇప్పుడవే టికెట్లు రెండు వందల యాభై రూపాయల దాకా ఉన్నాయి. సో పోలిక సబబు కాదు. ఒకవేళ మా ఇంటి బంగారం కనక హండ్రెడ్ క్రోర్ క్లబ్బులో కనక చేరితే సమంత ఖాతాలో అరుదైన మైలురాయి చేరుతుంది. ఇప్పుడప్పుడే బ్రేక్ చేయడం అసాధ్యం. కాకపోతే ఈ వారం రెండు రిలీజులు ఉన్నాయి. రావు బహదూర్, నాగబంధం దేనికవే కంటెంట్ పరంగా ప్రామిసింగ్ గా ఉన్నాయి. బాలీవుడ్ మూవీ అల్ఫాకు మల్టీప్లెక్సుల మద్దతు దక్కొచ్చు. ఈ నేపథ్యంలో మా ఇంటి బంగారం రన్ తిరిగి కొనసాగాలంటే వీటికొచ్చే టాక్స్ కీలకం కానున్నాయి. ఒకవేళ ఇవి బాగుంటే కనక బంగారం బాగా నెమ్మదించేస్తుంది. అలా లేదంటే మటుకు ఇంకో అవకాశం దక్కుతుంది. హీరో లేకుండా సామ్ ఒక్కర్తే ఇంత ఫీట్ సాధించడం విశేషమే.



# బిజినెస్ న్యూస్



## ఏడాది వ్యాలిడిటీతో వొడాఫోన్ ఐడియా కొత్త ప్రీపెయిడ్ ప్లాన్





ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌తో ముందుకొచ్చింది. రూ.4600తో వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. అపరిమిత కాల్స్, డేటాతో దేశవ్యాప్తంగా ఉన్న 4జీ, 5జీ యూజర్లకు ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం కొన్ని సర్కిల్లోనే అందుబాటులో ఉంది. త్వరలో అన్ని సర్కిళ్లకూ విస్తరించనుంది. ఈ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. రోజూ అపరిమిత డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ లభిస్తాయి. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వ్యక్తిగత, నాన్ కమర్షియల్ ఉపయోగానికి మాత్రమే ఈ ప్లాన్‌ను తీసుకొచ్చింది. 5జీ నెట్‌వర్క్ కవరేజీ ఉన్న ప్రాంతంలో 5జీ అపరిమిత డేటా లభిస్తుంది. అపరిమిత డేటాపై రోజువారీ పరిమితి లేకపోయినప్పటికీ.. 28 రోజులకు గరిష్ఠంగా 300 జీబీ వరకు మాత్రమే డేటా వినియోగించుకోవచ్చు. పరిమితి మించాక వేగం నెమ్మదిస్తుంది. రోజుకు రూ.12.6 చొప్పున ఖర్చు అవుతుంది. వార్షిక ప్లాన్‌తో పాటు 6 నెలల వ్యాలిడిటీతో మరో ప్లాన్‌నూ వొడాఫోన్ ఐడియా తీసుకొచ్చింది. 180 రోజుల వ్యాలిడిటీతో రూ. 2,475 ప్రీపెయిడ్ ప్లాన్‌ను లాంచ్ చేసింది. ఈ ప్లాన్‌లోనూ అపరిమిత డేటా, అపరిమిత కాల్స్ అందిస్తుంది. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. వార్షిక ప్లాన్ మాదిరిగానే డేటా పరిమితి నిబంధనలు వర్తిస్తాయి.

## రెండు రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, రియాల్టీ, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 443 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 162 పాయింట్ల పైకి చేరింది. సెన్సెక్స్ ఉదయం 76,545.21 పాయింట్లు (క్రితం ముగింపు 76,478.67) వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సూచీలు లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో 77,110.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 443.97 లాభంతో 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.10 పాయింట్ల లాభంతో 24,005.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నెల్, ఏషియన్ పెయింట్స్, హిందూస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్ మహీంద్రా, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.23గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.34 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,987 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## చిక్కుల్లో వాట్సప్.. యూజర్ నేమ్‌పై కేంద్రం నజర్




ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ తీసుకొస్తున్న యూజర్‌నేమ్ సదుపాయంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రముఖుల పేర్లతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, దుర్వినియోగానికి ఈ ఫీచర్ వీలు కల్పిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో దీనిపై దృష్టి సారించింది. వాట్సప్ తీసుకొస్తున్న కొత్త ఫీచర్‌ను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ మోసాలు, వినియోగదారుల భద్రత కోణంలో సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఏదైనా ముప్పు పొంచి ఉందని తేలితే మెటాకు నోటీసు జారీ చేసే అవకాశముందని తెలిపాయి. జాతీయ భద్రత విషయంలో రాజీపడేది లేదని కేంద్రం స్పష్టంచేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఏమిటీ యూజర్ నేమ్ ఫీచర్

ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొస్తోంది. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం ఉండదు. కేవలం యూజర్ నేమ్‌ద్వారా సంభాషణలను జరపవచ్చు. ప్రస్తుతం యూజర్ నేమ్‌ను రిజర్వు చేసుకునేందుకు వాట్సప్ అనుమతిస్తోంది. యూజర్ నేమ్‌లో 3 నుంచి 35 క్యారక్టర్లను అనుమతిస్తారు. అందులో సెలబ్రిటీలు, అత్యున్నత స్థాయి వ్యక్తుల పేర్లను అనుమతించబోరు. యూజర్ నేమ్‌వల్ల ఫోన్ నంబరు కనిపించదని, పెద్ద గ్రూపుల్లో మీరు యాడ్ అయినప్పుడు మీ ప్రైవసీకి రక్షణ లభిస్తుందనేది వాట్సప్ వాదన.

ఆందోళనలు ఏమిటి?

ఫోన్ నంబర్‌ను షేర్ చేయకుండా చాట్ చేయడానికి వాట్సప్ తీసుకొచ్చిన యూజర్ నేమ్ సదుపాయంపై సైబర్ నిపుణులు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సుపరిచిత వ్యక్తుల పేర్లతో నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసేందుకు ఈ ఫీచర్ అవకాశం కల్పిస్తోందని హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏదో ఒక యూజర్‌నేమ్‌ను అంచనా వేసి నేరుగా మెసేజ్ చేసే అవకాశం ఉండటంతో స్పామ్ కాల్స్, సందేశాలు పెరిగే అవకాశం ఉందని సైబర్ నిపుణుల వాదన. ఫోన్ నంబర్లు గోప్యంగా ఉంచడం వరకు బాగున్నా.. మోసాలను అరికట్టడానికి తగిన భద్రతా చర్యలు లేకపోతే టెలిగ్రాం తరహా మోసాలకు వాట్సప్ వేదికగా మారుతుందన్న ఆందోళనలూ నెలకొన్నాయి.

## కియా కొత్త కార్లు.. మార్కెట్‌లోకి టాప్ వేరియంట్లు




కియా ఇండియా తన పాపులర్ ఎస్‌యూవీ సెల్టోస్ లైనప్‌ను మరింత బలోపేతం చేస్తూ కొత్తగా జీటీఎక్స్(z) (GTX(O)), ఎక్స్–లైన్(z) (X-Line(O)) అనే టాప్ వేరియంట్లను భారత మార్కెట్లో విడుదల చేసింది. కంపెనీ ప్రకటన ప్రకారం.. ఈ కొత్త వేరియంట్ల ఎక్స్–షోరూమ్ ధరలు రూ. 21.56 లక్షల నుంచి ప్రారంభమవుతున్నాయి. దీంతో, ఇప్పటివరకు టాప్‌లో ఉన్న GTX(A), X-Line(A) వేరియంట్ల స్థానాన్ని ఇవి భర్తీ చేశాయి.

సెల్టోస్ ప్రస్తుత బేస్ మోడల్ ధర రూ. 10.99 లక్షల (ఎక్స్–షోరూమ్) వద్ద కొనసాగుతుండగా, కొత్త టాప్ వేరియంట్లు ప్రీమియం ఫీచర్లు, సేఫ్టీ టెక్నాలజీతో మరింత హైఎండ్ సెగ్మెంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ కొత్త వేరియంట్లలో ప్రధాన ఆకర్షణగా ఁణాూా ఎావజవశ్రీ 2 ఖీం సూట్ అందుబాటులోకి వచ్చింది. ఇందులో మొత్తం 28 అధునాతన డ్రైవర్ అసిస్టెన్స్ ఫీచర్లు ఉన్నాయి. జంక్షన్ క్రాస్ కొలిజన్ కంట్రోల్, లేన్ చేంజ్ అలర్ట్స్, ఫార్వర్డ్ కొలిజన్ వార్నింగ్, లేన్ కీప్ అసిస్ట్, హైవే డ్రైవింగ్ అసిస్ట్ వంటి సేఫ్టీ టెక్నాలజీలు ఇందులో భాగంగా ఉన్నాయి. ఇవి డ్రైవింగ్‌ను మరింత సురక్షితంగా మార్చేలా రూపొందించినట్లు కంపెనీ తెలిపింది.

ఫీచర్ల పరంగా కూడా ఈ వేరియంట్లు మరింత ప్రీమియంగా ఉన్నాయి. కనెక్టెడ్ కార్ నావిగేషన్ కాక్‌పిట్, ప్రాంతీయ భాషల్లో వాయిస్ కమాండ్స్ సపోర్ట్, డిజిటల్ కీ, హెడ్–అప్ డిస్‌ప్లే (HUD), AQI డిస్‌ప్లే ఉన్న స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫైయర్, అలాగే మొబైల్ యాప్ ద్వారా నియంత్రించగల ఫ్రంట్––రియర్ డాష్‌క్యామ్‌లు వంటి ఆధునిక సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. అంతేకాకుండా రైన్–సెన్సింగ్ వైపర్లు, వన్–టచ్ పవర్ విండోస్, కియా కనెక్ట్ 2.0 ద్వారా 85కు పైగా కనెక్టెడ్ ఫీచర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. మార్కెట్లో ఈ అప్‌గ్రేడ్‌తో సెల్టోస్ పోటీ మరింత పెరిగింది. ఇది మారుతి సుజుకి గ్రాండ్ విటారా, టయోటా అర్బన్ క్రూయిజర్ హైరైడర్, హ్యుందాయ్ క్రెటా, హోండా ఎలివేట్ వంటి ప్రముఖ మిడ్–సైజ్ ఎస్‌యూవీలతో నేరుగా పోటీ పడుతోంది ఇంజిన్ ఆప్షన్ల విషయానికి వస్తే, సెల్టోస్‌లో 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ (115 బిహెచ్‌పి), 1.5 లీటర్ డీజిల్ (116 బీహెచ్‌పీ), 1.5 లీటర్ టర్బో పెట్రోల్ (160 బీహెచ్‌పీ) ఇంజిన్ ఆప్షన్లు కొనసాగుతున్నాయి. ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో మాన్యువల్, సివిటి, ఆటోమేటిక్, ఐఎంటీ, 7–స్పీడ్ ఐజు వంటి వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి.

# శ్రీ సిటీ చేరుకున్న నారా చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం

**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం 6.10 గం.లకు శ్రీ సిటీ మదనపాలెం హెలిపాడ్ చేరుకున్న ఆం.ప్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ఘన స్వాగతం లభించింది.జిల్లా ఇన్చార్జి మంత్రి,రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు,ఇండిస్ట్రీస్ డైరెక్టర్ శుభం బన్సల్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, హీరో మోటార్స్ ప్రతినిధులు సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, ఆదిమూలం, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ సి వి నాయుడు,పరసారత్నం, సత్యవేడు ఇంచార్జ్ శంకర్ రెడ్డి, సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన మదనపాలెం గ్రామంలో హీరో మోటర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు.

## నారా లోకేష్, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు ఘన స్వాగతం





**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు ఘన స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ బానుప్రకాష్ రెడ్డి, చంద్రగిరి, కాళహస్తి, నగరి పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి గాలి భానుప్రకాష్, మురళి మోహన్, శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ మంత్రి శ్రీమతి పనబాక లక్ష్మి, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్స్ చైర్మన్ శ్రీమతి సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు తదితరులు స్వాగతం పలికారు.

## పెన్షన్ల పంపిణీలో రాష్ట్రం దేశానికే ఆదర్శం

**-ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సామాజిక ఫించన్ల పంపిణీలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల రూపాయల అప్పు పెట్టి వెళ్ళినా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల రూ.4 వేల ం టంచన్ గా ఒకటవ తేది అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన చెప్పారు. 49వ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ ను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు.నెల, నెలా పెన్షన్ టైంకు అందుతున్నదా అని లబ్దిదారులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రశ్నించగా సక్రమంగా అందుతున్నదని సంతోషం వ్యక్తం చేశారు. నగరంలో 18 వేల 245 మందికి ప్రతి నెలా 8 కోట్ల 12 లక్షల 95 వేల రూపాయలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టిన రెండేళ్ళలో ఫించన్ల కోసం 68 వేల 597 కోట్లు వ్యయం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీఠ వేస్తున్నారని చెప్పారు. మొదటి తారీఖు సెలవు దినం అయితే ముందు రోజే పెన్షన్స్ అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదని రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్ ను తొలి నెల నుంచే ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. నగరంలో 18వేలకు పైగా లబ్దిదారులకు ఉదయం 7 గంటల నుంచే పెన్షన్ సచివాలయ సిబ్బంది అందిస్తున్నారని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి చెప్పారు. డ్రైనేజీ, రోడ్డు సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరక్టర్ కుమారమ్మ, మాజీ కార్పోరేటర్ అన్నా అనిత, ఏపీయూఎఫ్ఐడిసి డైరెక్టర్ చందన, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా పోకల అశోక్ కుమార్ జన్మదిన వేడుకలు



**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్ జన్మదిన వేడుకలు తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. బైరాగి పట్టెడలోని ఆయన నివాసంలో జరిగిన వేడుకలకు అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానులు పోకల అశోక్ కుమార్‌కు గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు.అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. భారీగా బాణసంచా పేల్చడంతో నివాస పరిసరాలు సందడిగా మారాయి.ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు, స్థానిక నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు విచ్చేసిన ప్రతి ఒక్కరినీ పోకల అశోక్ కుమార్ ఆత్మీయంగా పలకరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# హీరో మోటోకార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

**-రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ప్రాజెక్టు దోహదం: సీఎం**

**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం మదనపాలెం గ్రామంలోని హీరో మోటోకార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 కేంద్రానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ప్రపంచంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తన రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చొరవతో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిజిల్లా వరదయ్యపాలెం మండలంలో "ఏర్పాటు కానుంది.ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం మదనపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ చేరుకొని, అక్కడి నుంచి శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి కార్యక్రమంలో ప్రసంగిస్తూ హీరో మోటోకార్ప్ సంస్థ చేపట్టనున్న గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

హీరో మోటోకార్ప్ గ్లోబల్ విడిభాగాల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లకు వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా ఈ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు హీరో సంస్థ



తెలిపింది.అనంతరం హీరో మోటోకార్ప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ పవన్ ముంజాల్, అనీషా ముంజాల్, సీఈవో హర్షవర్ధన్ చిట్లే, సంస్థప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు, అధికారులతో కలిసి హీరో మోటోకార్ప్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. భవిష్యత్తులో ప్లాంట్ ద్వారా చేయనున్న ఉత్పత్తి, నిల్వ, పంపిణీ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ రిజిస్ట్రేషన్ శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, జేసి ఆర్. గోవింద రావు, ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేందర్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి రాంమోహన్ రావు, ప్రజా ప్రతినిధులు, హీరో మోటోకార్ప్ సంస్థ మరియు శ్రీసిటీ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్‌ను హీరో మోటోకార్ప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ పవన్ ముంజాల్ ఘనంగా సన్మానించారు.హీరో మోటోకార్ప్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్ డాక్టర్ బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్ 103వ జయంతిని పురస్కరించుకుని ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# వాహన డీలర్లతో రవాణా శాఖ సమన్వయ సమావేశం



**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా రవాణా శాఖాధికారి ఆధ్వర్యంలో అన్ని రకాల మోటారు వాహనాల డీలర్లతో అవగాహన సమావేశం బుధవారం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ వాహనం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారునికి తొలి సేవా కేంద్రం డీలర్‌షిప్ కావడంతో, డీలర్లు కస్టమర్లతో మర్యాదపూర్వకంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.వాహన రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రభుత్వ రుసుములు, పన్నులు, సేవా రుసుములు మరియు ఇతర చార్జీల వివరాలను షోరూమ్‌లలో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములకు మించి ఎటువంటి అదనపు రుసుము వసూలు చేయరాదని స్పష్టం చేయరాదని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, ప్రతి వాహన కొనుగోలు దారునికి ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్ అవసరమా కాదా అనే విషయాన్ని ముందుగానే తెలియజేయాలని, ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే జరుగుతుందని వారికి వివరించాలని సూచించారు.కస్టమర్లకు వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ, చెల్లించాల్సిన రుసుములు, అవసరమైన పత్రాలు మరియు ఇతర వివరాలపై పూర్తి అవగాహన కల్పించాలని, ప్రతి లావాదేవీలో పారదర్శకత పాటించాలని సూచించారు. డీలర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిర్దిష్టమైన అనుమతి పత్రాలు మాత్రమే పొందుపరచాలని ,రవాణా శాఖ ప్రజలకు పారదర్శకమైన, అవినీతిరహిత, జవాబుదారీతనం కలిగిన సేవలను అందించడానికి కట్టుబడి ఉందని, ఈ లక్ష్య సాధనలో డీలర్ల సహకారం ఎంతో అవసరమని మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు సమావేశంలో పాల్గొన్న డీలర్లు సూచనలను పాటిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికానాజ్ మరియు పరిపాలన అధికారులు విజయ్ కుమార్ విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

# పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు

**-వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ ఔ మేనేజింగ్ డైరెక్టర్ బుధవారం వినియోగదారులతో వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికై ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి జరిగిన ఈ కార్యక్రమం ద్వారా 5 గురు పారిశ్రామిక వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై చర్చిస్తూ, పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో సబ్–స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని వివరించారు.అదేవిధంగా పారిశ్రామిక విద్యుత్ సర్వీసులకు అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుగా ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేశామని,పారిశ్రామిక విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సంస్థ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా నుంచి లార్విన్ గ్లాస్ ఇండస్ట్రీ ప్రతినిధి కే. హరిబాబు మాట్లాడుతూ తమకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలియజేశారు. ఈ అంశంపై అధికారులు స్పందిస్తూ సరఫరాలో అంతరాయాలను నిరోధించేందుకు వీలుగా లైన్ పెట్రోలింగ్ నిర్వహించి, లోటుపాట్లను సరి చేయిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్ ఔ హెచ్ఆర్ డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం. మురళి కుమార్, కే. సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు చక్రపాణి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

**-వినియోగదారులకు మరింత చేరువగా ఐటి సేవలు**

**-సమీక్షా సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి**



**తిరుపతి,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులు, సిబ్బందికి సూచించారు. తిరుపతిలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ శివశంకర్ లోతేటి ఆ సంస్థ అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సంస్థ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ విద్యుత్ సర్వీసులతోపాటు కొన్ని ఇతర కేటగిరీల సర్వీసులకు కూడా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశామని వివరించారు. స్మార్ట్ మీటర్ల పనులను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

**మరింత మెరుగ్గా ఐటీ సేవలు**

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సీఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించడం తోపాటు ఆన్లైన్ చెల్లింపులను సరళతరం చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపులు 100 శాతానికి చేరేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే సందర్భంలో సమాచారాన్ని వినియోగదారులకు ముందుగానే తెలియజేసేందుకు వీలుగా 'విద్యుత్ మిత్ర' యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్ (ఫైనాన్స్/ఎఫ్ఎసి) కె. రామ మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జే. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, కె. ఆదిశేషయ్య, ఎన్. శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో 'డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు' ప్రారంభం

**చంద్రగిరి, జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి మండల పరిధిలోని కొలొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల పురస్కరించుకొని ప్రజలకు అవగాహన నిర్వహణ భాగంగా బుధవారం చంద్రగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ శిరీష పర్యవేక్షణలో జరిగింది.ఈ సందర్భంగా వైద్యాధికారి డా. శిరీష మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జూలై నెల అంతా డెంగ్యూ నివారణపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలలో చెక్, క్లీన్, కవర్,అనే మూడు సూత్రాలను పాటించాలని పిలుపునిచ్చారు.ఇళ్లలో మరియు చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి బాగా శుద్ధి చేసి వాడుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి.దోమ లార్వాలు పెరగకుండా నీటి డ్రమ్ములు, ట్యాంకులపై గట్టిగా మూతలు ఉంచాలి.అధిక జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, వంటిపై ఎర్రటి మచ్చలు వంటి డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శివయ్య , ఎం.పి.హెచ్.ఇ.ఓశివరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు వాసుదేవ రెడ్డి, దాక్షాయణి, ఎం.ఎల్.హెచ్.పి సమంతి, మరియు ఆశా కార్యకర్తలు సావిత్రి, శశికళ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**నాయుడుపేట ,జూలై 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. బుధవారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని మునిరత్నం నగర్ లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి పెన్షన్ దారులకు పించన్లు పంపిణీ చేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధితోపాటు,సంక్షేమ పథకాల అమలు చేయడం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు అవధానం సుధీర్,నిత్యా కృష్ణారెడ్డి,వినుకొండ ధనంజయ, ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు,మొండెం బాబు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027